



శశిధర్, సుమిత్రాదేవి దంపతులు

ఆ దేవుడే కాపాడాడు

- ఎలా కిందికి దిగామో మాకే తెలియదు
- కళ్ల ముందే చంద్రమౌళిని కాల్చేశారు
- 'ఆంధ్రజ్యోతి'తో పహల్గాం ఘటనలో ప్రత్యక్ష సాక్షులు రెడ్డి శశిధర్, సుమిత్రాదేవి

- వివరాలు మెయిన్‌లో

ఉక్కు కార్మికులకు అండగా ఉంటా

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల
- కూర్మన్నపాలెంలో దీక్షల శిబిరాన్ని సందర్శించి సంఘీభావం

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో 1,533 రోజులుగా కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని గురువారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సందర్శించి, సంఘీభావం తెలిపారు. ప్రస్తుతం ఉక్కు కర్మాగార పరిస్థితి, కాంట్రాక్టు కార్మికుల తొలగింపు, గత ఎనిమిది నెలలుగా అరకొర జీతాల చెల్లింపు తదితర ... మిగతా 6వ పేజీలో



ఉక్కు దీక్షల శిబిరంలో వైఎస్ షర్మిలకు సమస్యలు వివరిస్తున్న కార్మిక సంఘ నేతలు



దేశానికి అంతర్గత టెర్రరిస్ట్ మోదీ

- మెయిన్‌లో

- ఇండియా నిఘా వ్యవస్థలను మోదీ వ్యవస్థలుగా మార్చారు
- పహల్గాం ఘటనకు బాధ్యత వహిస్తూ మోదీ, అమిత్ షా రాజీనామా చేయాలి : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

హిందువులే లక్ష్యంగా ఉగ్ర దాడులు

- ఇలాంటి ఘటనలపై ప్రతి ఒక్కరూ స్పందించాలి
- ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్
- ఉగ్ర దాడిలో అశువులు బాసిన చంద్రమౌళికి ఘన నివాళి

పహల్గాం ఘటనలో మృతిచెందిన విశాఖ వాసి చంద్రమౌళి కుటుంబాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గురువారం రాత్రి పరామర్శించారు. ముందుగా జిల్లా పరిషత్ జంక్షన్ దగ్గరున్న కనక దుర్గ ఆస్పత్రిలో చంద్రమౌళి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి పాండురంగాపురంలో ఉన్న చంద్రమౌళి నివాసానికి వెళ్లి ఆయన భార్య నాగమణి, కుటుంబీకులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. - వివరాలు మెయిన్‌లో



చంద్రమౌళి మృతదేహాన్ని ఉంచిన ఫ్రీజర్‌పై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్. చిత్రంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, హోం మంత్రి వంగలపూడి అనిత ఉన్నారు.

నేడు డీఆర్‌సీ సమావేశం

- అజెండాలో 12 అంశాలు
- జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏల పనితీరుతో పాటు రెవెన్యూ, విద్య, వైద్య ఆరోగ్య, పౌర సరఫరాల శాఖలపై సమీక్ష

విశాఖపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమీక్ష మండలి (డీఆర్‌సీ) సమావేశం శుక్రవారం ఉదయం పది గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అధ్యక్షతన జరగనున్నది. ఆయన ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన తరువాత గత ఏడాది అక్టోబరు 25న జిల్లా అభివృద్ధిపై సమీక్ష జరిగింది. ఏడు నెలల తరువాత శుక్రవారం జరగనున్న సమావేశంలో మొత్తం 12 అంశాలతో రూపొందించిన ఎజెండాపై చర్చించనున్నారు. జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ సంస్థల పనితీరుతో పాటు రెవెన్యూ, వైద్యం, విద్య, ఈపీడీసీఎల్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, సంక్షేమం, పౌర ... మిగతా 6వ పేజీలో

ఐటీ భవనాలన్నీ ఖాళీ!

నామమాత్రపు ఉద్యోగులతో విప్రో నిర్వహణ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో ఐటీ భవనాలన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దశాబ్దాల క్రితమే ప్రభుత్వం కేటాయించిన భూములు తీసుకున్న కంపెనీలు వాటిల్లో కార్యకలాపాలు మాత్రం ప్రారంభించడం లేదు. ఈ జాబితాలో పెద్దపెద్ద సంస్థలు కూడా ఉండడం గమనార్హం. ఒక్క రుషికొండ ఐటీ పార్కులోనే సుమారు 2 లక్షల చ.అ. విస్తీర్ణం ఖాళీగా ఉంది.

- హామీ నెరవేర్చలేదని భూమి రిజిస్ట్రేషన్ ఆపిన ప్రభుత్వం
- రుషికొండ ఐటీ పార్కులో భూములు తీసుకుని కార్యకలాపాలు ప్రారంభించని కంపెనీలెన్నో...
- భవనాలు ఖాళీగా ఉంచి కాలక్షేపం



విప్రో భవనం

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ప్రభుత్వం నుంచి భూములు తీసుకున్న పలు ఐటీ సంస్థలు దశాబ్దం దాటినా ఆ హామీని నెరవేర్చకుండా భవనాలను ఖాళీగా ఉంచేశాయి. కొన్ని సంస్థలైతే తీసుకున్న భూముల్లో భవనాలు నిర్మించి అక్కడితో పని అయిపోయినట్టు చేతులు దులుపుకొన్నాయి. 2006లో విశాఖ నగరం నడిబొడ్డున ఏడు ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం విప్రో టెక్నాలజీస్‌కు కేటాయించింది. అందులో 6,200 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆ సంస్థ హామీ ఇచ్చింది. చాలాకాలం పాటు ఆ భూమిని ఖాళీగా ఉంచిన విప్రో...ఆ తరువాత నాలుగు ఎకరాల్లో ఆరు అంతస్థుల భవనాన్ని నిర్మించింది. దానిని కూడా ఖాళీగా ఉంచింది. విశాఖ ఎంపీగా పురందేశ్వరి ఉన్న సమయంలో నాటి ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుతో కలసి ఆ భవనాన్ని సందర్శించారు. వెంటనే ఆపరేషన్లు ప్రారంభించి, ఉద్యోగ అవకాశాలు కల్పించకపోతే భూ కేటాయింపు రద్దు చేస్తామని హెచ్చరించారు. దాంతో అప్పటికప్పుడు 300 మందితో కార్యకలాపాలు ప్రారంభించారు. పక్కనే ఉన్న మూడు ఎకరాల్లో ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) ఏర్పాటుకు దరఖాస్తు చేయగా 2014లో కేంద్రం అనుమతి ... మిగతా 6వ పేజీలో

రుషికొండలోనూ ఇదే పరిస్థితి

రుషికొండ హిల్ నం.2లో కలర్ చిప్స్‌కు 2 ఎకరాలు, మిరాకిల్‌కు 2 ఎకరాలు, ఆ పక్కనే మరో సంస్థకు 3 ఎకరాలు కేటాయించారు. వీరంతా భవనాలు అయితే నిర్మించారు కానీ కార్యకలాపాలు మాత్రం ప్రారంభించలేదు. సుమారు పదేళ్లుగా ఈ భవనాలన్నీ ఖాళీగానే ఉన్నాయి. కనీసం అద్దెకు కూడా ఇవ్వలేదు. అలాగే హిల్ నంబర్ 3లో ఎక్సీటీ గ్లోబల్ ఐదేళ్ల క్రితం నిర్మించిన భవనం కూడా ఖాళీగానే ఉంది. ఇవికాకుండా ఇంకా పలు పెద్ద కంపెనీలు భూములు తీసుకొని ఇప్పటివరకూ ఎటువంటి కార్యకలాపాలు చేపట్టలేదు. అదానీ డేటా సెంటర్ కోసం మధురవాడ హిల్ నంబర్ 4పై సుమారు 200 ఎకరాలు కేటాయించారు. శంకుస్థాపనలు కూడా జరిగి ఏళ్లు దాటిపోయాయి. కొండ మీదకు రోడ్డు తప్ప ఇంకేమీ చేయలేదు.పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని కూటమి ప్రభుత్వం అడగడంతో ప్రహరీ నిర్మాణం మాత్రం చేపడుతున్నారు. ఇప్పట్లో డేటా సెంటర్ ఏర్పాటుచేసే ఆలోచన వారికి లేదని ఐటీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కొత్తగా ఎవరికి భూము లు ఇచ్చినా ఎంత గడువులో ఆపరేషన్లు ప్రారంభిస్తారో స్పష్టమైన హామీ తీసుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తారాబు జలపాతంలో ఇంజనీరింగ్ విద్యార్థి గల్లంతు

- పుట్టినరోజు వేడుక జరుపుకునేందుకు స్నేహితులతో కలిసి వచ్చి ప్రమాదం బారిన...



ప్రమాదానికి కొద్ది సమయం ముందు జలపాతం వద్ద కిశోర్

పెదబయలు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పుట్టినరోజు వేడుక జరుపుకునేందుకు స్నేహితులతో కలిసి గురువారం తారాబు జలపాతానికి వచ్చిన ఓ బీటెక్ విద్యార్థి గల్లంతయ్యాడు. స్నేహితులు ఎంత గాలించినా ఆచూకీ లభించలేదు. దీనికి సంబంధించి పెదబయలు ఎస్‌ఐ కొల్లి రమణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు జిల్లా భీమడోలుకు చెందిన గొన్నూరు కిశోర్ (22) విశాఖపట్నం జిల్లా పెందుర్తిలోని వెల్ఫేర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 25న అతని పుట్టినరోజు కావడంతో తోటి విద్యార్థులు లోకవరపు చంద్రశేఖర్, పాడి శామ్యూల్, కమ్మనేని సంతోశ్‌లతో కలిసి బుధవారం రాత్రి అరకులోయ వచ్చాడు. అక్కడ ఓ లాడ్జిలో బస చేశారు. గురువారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో అంతా కలిసి తారాబు జలపాతం వద్దకు వెళ్లారు. అక్కడ ఫొటోలు దిగారు. జలపాతం సందర్శన అనంతరం మళ్లీ రాత్రి అరకులోయ వెళ్లి కేక్ కట్ చేయాలని నిర్ణయించుకున్నారు. అయితే జలపాతంలో స్నానం చేయడానికి దిగిన కిశోర్ గల్లంతయ్యాడు. అతని కోసం స్నేహితులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రమణ తెలిపారు.

సాదాసీదాగా ఏయూ శతాబ్ది వేడుకల ప్రారంభం?

వర్సిటీ అధికారుల తీరుపై విమర్శలు

- ముందస్తు ప్రణాళిక లేకపోవడమే కారణం
- ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వమే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్టయితే బాగుండేదనే అభిప్రాయం



విశాఖపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది వేడుకలకు సిద్ధమవుతోంది. ఈ నెల 26 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 26వ తేదీ వరకూ ఉత్సవా లను ఘనంగా నిర్వహిస్తామని అధికారులు ప్రకటించారు. అయితే, ప్రారంభ వేడుకలను తూతూమంత్రంగా నిర్వహించనుండడంపై వర్సిటీ వర్గాలతోపాటు పూర్వ విద్యార్థుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ఏయూ వందేళ్ల వేడుకల ప్రారంభోత్సవానికి ప్రముఖులు హాజరవుతారని అంతా భావించారు. అయితే ఈ నెల 26న కార్యక్రమానికి గవర్నర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌లు రావడం లేదంటున్నారు. సాధారణంగా రెండు, మూడు నెలల ముందు నుంచే ప్రముఖులను ఆహ్వానించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలి. అయితే, గతంలో ఇన్‌చార్జి వీసీ ఉండడం, ఇటీవల పూర్తిస్థాయి వీసీ నియామకం జరిగినా ఆయనకు వర్సిటీపై అవగాహన రావడానికి కొంత సమయం పట్టడం, ఇతర కారణాల వల్ల వేడుకల నిర్వహణకు సంబంధించి అతిథులను ఆహ్వానించడం ఆలస్యమైంది. ఈ నేపథ్యంలో ఇతర కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉన్నందున 26వ తేదీన రాలేమని ... మిగతా 6వ పేజీలో

దూర విద్య పరీక్షల్లో మాస్ కాపీయింగ్

- పుస్తకాలు ఇచ్చి రాయిస్తున్న కొన్ని కళాశాలలు
- పట్టించుకోని ఏయూ అధికారులు

విశాఖపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం దూర విద్య పరీక్షల్లో మాస్ కాపీయింగ్ యథేచ్ఛగా సాగుతోంది. గతంలో ఒక కళాశాలపై అధికారులు చర్యలు తీసుకున్నారు. అయినప్పటికీ ఈసారి కూడా మాస్ కాపీయింగ్‌కు అడ్డుకట్ట పడలేదు. కొన్ని కాలేజీలు అత్యంత పకడ్బందీగా ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నట్టు తెలుస్తోంది. కాలేజీల్లో మాస్ కాపీయింగ్‌కు సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. విజయనగరం జిల్లా కొత్తవలసలోని ఒక కాలేజీలో విద్యార్థులకు పుస్తకాలను ఇచ్చి పరీక్షలు రాయిస్తున్నట్టు తెలిసింది. అలాగే గజపతినగరంలోని కాలేజీలో కూడా ఇదే తరహాలో మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్టు చెబుతున్నారు. తాడేపల్లిలోని ఒక కాలేజీలో పెద్దఎత్తున మాస్ కాపీయింగ్ జరుగుతోంది. అక్కడ యాజమాన్యం ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటుచేసినట్టు చెబుతున్నారు. కొన్ని కాలేజీల్లో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ వాటి డైరెక్షన్‌ను మార్చేశారు. ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించి ముందు నుంచీ ఆరోపణలు వస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఇటువంటి పరిస్థితి ఉత్పన్నమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కేజీహెచ్ వైద్యులకు షోకాజ్

- ఈ నెల 18న మంత్రి పర్యటన సమయంలో ఆస్పత్రిలో లేని ఏడుగురు వైద్యులకు నోటీసులు
- ఈ 22న డీఎంఈ పర్యటనలో కానరాని ఆరుగురు వైద్యులకు కూడా...



విశాఖపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్నారనే అభియోగంపై కేజీహెచ్‌లో పది మందికిపైగా వైద్యులకు ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులను జారీచేశారు. ఈ నెల 18న జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆయన అనేక విభాగాల ఓపీలను, వార్డులను సందర్శించారు. ఆ సమయంలో కొందరు వైద్యులు లేకపోవడాన్ని మంత్రి గుర్తించారు. వైద్యులు అందుబాటులో లేకపోవడంపై సీరియస్ అయ్యారు. విధి నిర్వహణ సమయంలో అందుబాటులో లేని వైద్యులకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంత్రి పర్యటనలో అందుబాటులో లేని ఏడుగురు వైద్యులకు ఆస్పత్రి ఉన్నతాధికారులు నోటీసులు జారీచేశారు. వీరిలో గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎల్‌ఆర్‌ఎస్ గిరినాథ్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ వంశీయాదవ్, డాక్టర్ మోహన్‌వంశీ, నెఫ్రాలజీ విభాగాధిపతి డాక్టర్ జి.ప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ రత్నప్రభ, డాక్టర్ ఐఎస్ అనిత ఉన్నారు. అలాగే, ఈ నెల 22న అదనపు డీఎంఈ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ఆయన ఓపీతోపాటు క్యాజువాల్టీని పరిశీలించారు. ఆ సమయంలో పలువురు వైద్యులు విధుల్లో లేకపోవడాన్ని గుర్తించారు. కొందరు ఉన్నా రూముల్లో, ఇతర పనుల్లో ... మిగతా 6వ పేజీలో



భక్తులకు టికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఈఓ సుబ్బారావు

అప్పన్న చందనోత్సవ టికెట్ల విక్రయాలు ప్రారంభం

సింహాచలం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి నిజరూప దర్శనం (చందనోత్సవం) టికెట్ల విక్రయాల గురువారం ప్రారంభమయ్యాయి. నిర్ణీత సమయానికి దేవస్థానం ఈఓ కె.సుబ్బారావు పూజలు చేసి, తొలి టికెట్‌ను సింహగిరిపై పాత పీఆర్‌ఓ ఆఫీసు కౌంటర్‌లో భక్తునికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఈవో అందజేశారు. టికెట్ల కోసం దేవస్థానం రూపొందించిన ప్రత్యేక దరఖాస్తులో పేరు, ఆధార్ కార్డు నంబరు, చిరునామాలను రాసి అందజేయాలి. దాని ఆధారంగా కౌంటర్‌లోని సిబ్బంది రూ.300 లేదా రూ.1000 టికెట్లను స్లాట్స్ కేటాయించి అందజేస్తున్నారు. ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్ సింహాచలం శాఖలతోపాటు నగరంలోని మరికొన్ని శాఖల్లో, ఆన్‌లైన్‌లో కూడా చందనోత్సవ టికెట్ల విక్రయాలు ప్రారంభమయ్యాయి.

తొలివిడత చందనం అరగదీతకు శ్రీకారం



చందనం అరగదీస్తున్న ప్రధానార్చకులు

సింహాచలం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామిపై పూతగా వేసేందుకు చందనం సిద్ధం చేస్తున్నారు. గురువారం ఆలయ ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు సంప్రదాయబద్ధంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్వామికి నాలుగు విడతలలో 12 మణుగుల చందనాన్ని సమర్పిస్తారు. తొలివిడత చందన చెక్కల అరగదీతను ఏటా చైత్రమాస బహుళపక్ష ఏకాదశినాడు ప్రారంభించడం ఆచారంగా వస్తోంది. అదేక్రమంలో గురువారం సుప్రభాతసేవ, ప్రభాతారాధనలు తరువాత ముందుగా సిద్ధం చేసిన మంచి గంధపు చెక్కను మంగళవాయిద్యాల నడుమ దేవస్థానం ఈఓ కె.సుబ్బారావుతో కలిసి బేడామండప ప్రదక్షిణయుతంగా అంతరాలయంలోకి తీసుకువెళ్లి పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో సిద్ధంగా ఉంచిన ప్రత్యేక శిలలపై మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ అరగదీయడానికి లాంఛనంగా శ్రీకారం చుట్టారు. ఈ నెల 30న చందనోత్సవం రోజున అప్పన్నకు తొలివిడత చందనం సమర్పిస్తారు.

బెట్టింగ్ కేసులో ఏయూ ఉద్యోగులు..!

- ఒకరు అరెస్టు, పరారీలో మరొకరు
- గోప్యంగా ఉంచుతున్న సైబర్ క్రైమ్ పోలీసులు

ఎండాడ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులపై సైబర్ క్రైమ్ పోలీసులు బెట్టింగ్ కేసు నమోదు చేసినట్టు తెలిసింది. నగరంలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠాలో వీరిద్దరూ కీలకంగా వ్యవహరించినట్టు పోలీసులు నిర్ధారించినట్టు సమాచారం. ఈ ముఠాపై నిఘా పెట్టి, తాజాగా నలుగురిని అరెస్టు చేసినట్టు తెలిసింది. వారిలో ఒక ఏయూ ఉద్యోగి ఉన్నారని, మరో ఉద్యోగి పరారీలో ఉన్నారని తెలిసింది. ఇదిలావుండగా ఆన్‌లైన్ బెట్టింగ్ కేసుకు సంబంధించి ఇప్పటికే శివాజీపాలేనికి చెందిన తోనంగి శ్రీనివాసరావు, ఇసుకతోటకు చెందిన మువ్వల మధు, పెదవాల్తేరు ఆదర్శనగర్‌కు చెందిన యెంపల్లా రాజేశ్, ముడసర్లోవకు చెందిన కాసారపు చిన్నారావు, మధురవాడకు చెందిన చిట్టజల్లు బ్రహ్మాజీలపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వీరిలో మధు మినహా (పరారీలో ఉన్నాడు) మిగిలిన వారిని అరెస్టు చేసినట్టు తెలిసింది. కేసు వివరాలను సైబర్ క్రైమ్ పోలీసులు గోప్యంగా ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోంది.



చిట్టివలసలో ఉపాధ్యాయుల ప్రచారం

జీవీఎంసీ పాఠశాలలో 52 మంది విద్యార్థుల చేరిక

తగరపువలస, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చేరికల కోసం చిట్టివలస బీఆర్ అంబేడ్కర్ జీవీఎంసీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చిట్టివలస, సంతపేట, కొత్తపేట ప్రాంతాల్లో ఉపాధ్యాయులు బృందాలుగా పర్యటించారు. ఇంటింటికి వెళ్లి బడిఈడు పిల్లలను గుర్తించి, ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం వల్ల కలిగే ప్రయోజనాలు గురించి తల్లిదండ్రులకు వివరించారు. తొలి రోజు 52 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఇ. వరలక్ష్మి, హెచ్‌ఎం స్వామి, ఉపాధ్యాయులను అభినందించారు.

వంద మందికి నేత్ర పరీక్షలు



రోగిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

కొమ్మాది, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ నేత్ర సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని బీజేపీ సీనియర్ నాయకుడు కేఎన్‌పీ చక్రవర్తి అన్నారు. పీఎంపాలెం ఆర్ హెచ్ కాలనీలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు.వంద రోగులు శిబిరానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కొందరిని వైద్యులు శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు గోరే గురునాథ్, రెడ్డి సత్యనారాయణ, బీజేపీ నాయకుడు రాజు పాల్గొన్నారు.

చందనం సమర్పణకు రూ. లక్ష విరాళం

సింహాచలం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఈనెల 30న పైపూతగా సమర్పించు శ్రీచందనం నిమిత్తం అడివివరం గ్రామానికి చెందిన లోగీశ వరాహ నరసింహం కుటుంబ సభ్యులు రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ.1,00,001లను నగదు రూపంలో దేవాలయ స్థానాచార్యులు రాజగోపాల్ చేతుల మీదుగా పర్యవేక్షణాధికారి త్రిమూర్తులకు గురువారం సాయంత్రం వారు అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబీకులకు అధికారులు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి శేషవస్త్రం, వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కొమ్మాది, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కొమ్మాది సబ్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌టీఆర్ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నరేశ్ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కె3 కాలనీ, నవోదయ స్కూల్, డీఆర్‌కే రాజు, అన్నంరాజు నగర్, సాయిచంద్ర లేఅవుట్, గాయత్రీ కళాశాల, అష్టలక్ష్మీ దేవాలయం ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు.

పది పరీక్షల్లో 45 మంది ఉత్తీర్ణత

మధురవాడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు సునీల్‌శర్మ కాలనీ జడ్పీ హెచ్‌ఎస్ ఉన్నత పాఠశాల నుంచి 65 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 45 మంది ఉత్తీర్ణులయ్యారని హెచ్‌ఎం కె. గీతాదేవి తెలిపారు. గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 29 మంది ప్రథమ శ్రేణిలోను, 10 మంది ద్వితీయ శ్రేణిలోను పాసయ్యారన్నారు. 500 లకు పైగా మార్కులు వచ్చిన వారు నలుగురు ఉన్నారని చెప్పారు.

అప్పన్న భక్తుడికి టోకరా

సింహాచలం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి భక్తులు తరచూ అనేక మోసాలకు గురవుతున్నారు. ముఖ్యంగా రద్దీ రోజుల్లో దర్శనం చేయిస్తామని చెప్పి గుర్తు తెలియని వ్యక్తులు భక్తుల నుంచి నగదు దోచుకుంటున్నారు. గురువారం విజయవాడకు చెందిన భక్తుడొకరు స్వామివారి దర్శనానికి ఐదుగురు కుటుంబ సభ్యులతో కలిసి సింహగిరికి వచ్చారు. రద్దీగా ఉండడంతో మార్గం కోసం వెదుకుతుండగా ఎస్‌బీటీ కౌంటర్‌కు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి భక్తుడ్ని కలిసి మీకు త్వరగా దర్శనం కలిపిస్తానని నమ్మబలికాడు. అందుకు రూ.1500 ఖర్చు అవుతుందని చెప్పారు. నగదు తీసుకున్న మోసగాడు తిరిగి ఎప్పటికీ రాకపోవడంతో తాము మోసపోయినట్టు భక్తుడు నిర్ధారించుకుని దేవస్థానం పీఆర్‌ఓ కార్యాలయంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పర్యవేక్షణాధికారి పద్మనాభరాజు (విక్రమ్) సీసీ పుటేజీ పరిశీలించారు. అందులో కనిపించిన మోసగాడు రెండు నెలలకొకసారి వచ్చి ఇదే తరహాలో భక్తులను మోసగించి సొమ్ము కాజేస్తున్నట్టు దేవస్థానం సిబ్బంది కొందరు గుర్తించారు. పోలీసులు సిసి పుటేజీని తీసుకువెళ్లి దర్యాప్తు చేస్తున్నారు.

అందుబాటులోకి నూతన క్యూ కాంప్లెక్స్

సింహాచలం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై భక్తుల సౌకర్యార్థం ప్రసాద్ పథకం నిధులతో నిర్మించిన నూతన క్యూ కాంప్లెక్స్ భవనం గురువారం నుంచి అందుబాటులోకి వచ్చింది. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఈఓ సుబ్బారావు, 98వ వార్డు కార్పొరేటర్ నరసింహంతో కలిసి ప్రత్యేక పూజల అనంతరం నూతన క్యూ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. ఈనెల 30న జరిగే చందనోత్సవం నేపథ్యంలో భక్తులకు నీడ కల్పిస్తూ ఒకేసారి ఐదువేల మందికి సరిపడేలా ఈ భవనంలో క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఈ డిజి శ్రీనివాసరాజు, ఏఈలు బాబ్జీ, రవికుమార్, ఏఈఓ ఆనందకుమార్, 98వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చందనం అరగదీతలో ప్రముఖులు

చందనం అరగదీతలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పీవీజీఆర్ నాయుడు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, దేవస్థానం ఈఈ డిజి శ్రీనివాసరావు, తదితరులు పంచె ధరించి నోటికి గుడ్డ కట్టుకుని భక్తిప్రపత్తులతో చందనం అరగదీశారు.



చందనం అరగతీస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

వ్యర్థాలతో సుద్దగెడ్డ కలుషితం



గెడ్డలో పేరుకుపోయిన భవన నిర్మాణ వ్యర్థాలు

మధురవాడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని సుద్ద గెడ్డలో నీరు కలుషితమవుతోంది. ఈ గెడ్డపై ఎనిమిది చెక్ డ్యామ్‌లు ఉన్నాయి. దీంతో నీరు భూగర్భంలోకి నిలకడగా వెళుతుంది. మిథిలాపురి వుడా కాలనీ, ఎన్‌జీఓ కాలనీ, వాంబేకాలనీ, పాత మధురవాడ మెట్ట ప్రాంతాల ప్రజలు ఈ గెడ్డ నీరే ప్రధాన తాగునీటి వనరు. కొంతకాలంగా గెడ్డ నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవడంతో భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్తను వేస్తున్నారు. దీంతో గెడ్డ నీరు కలుషితమై రంగు మారిపోయింది. ఎన్‌జీఓ కాలనీ నుంచి వచ్చే మురుగు నీరు కూడా ఈ గెడ్డలోనే కలుస్తోంది. గతంలో ఎంతో స్వచ్ఛగా కనిపించే నీరు, ప్రస్తుతం ఆకుపచ్చగా మారిపోవడంతో పరిసర ప్రాంతాల్లో ఉంటున్న వారు దుర్వాసనకు ఇబ్బందులు పడుతున్నారు. మిథిలాపురి వుడా కాలనీ పరిసరాల్లోని బోరు బావులు ద్వారా వచ్చే నీరు కూడా దుర్వాసన వస్తోందని స్థానికులు చెబుతున్నారు. జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించి గెడ్డలో పూడికలు తీయించడంతో పాటు నిర్వహణపై కూడా దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

నాణ్యమైన విద్యతో మెరుగైన ఫలితాలు

విద్యా శాఖ ఆర్‌జేడీ విజయ్‌భాస్కర్

మధురవాడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించినప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయని విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయ్‌భాస్కర్ అన్నారు. గురువారం అడవివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆర్‌జేడీని మధురవాడలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి విష్ణువర్ధన్‌సాయి 588, కవిత 574 మార్కులు సాధించడం అభినందనీయన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తే మంచి ఫలితాలు వస్తాయని, అందుకు ఈ ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షా ఫలితాలే నిదర్శనమని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఇమంది పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ మృతి పట్ల నివాళి

పద్మనాభం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాండ్రంగి గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ ఆర్‌ఎల్‌సీఎల్ సన్యాసిరాజు (దేవుడుబాబు) మృతి పట్ల పలువురు నివాళి అర్పించారు. విజయనగరం జెడ్పీ ఛైర్మన్, వైసీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు గురువారం సన్యాసిరాజు మృతదేహాన్ని సందర్శించి, నివాళి అర్పించారు. ఆయనతో పాటు పోర్టు ట్రస్టు మాజీ డైరెక్టర్ పెదబాబు, విశాఖ జెడ్పీ వైస్ ఛైర్మన్ గిరిబాబు, ఎంపీపీ కె. రాంబాబు, పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌ఛార్జి అప్పారావు ఉన్నారు.

విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీకి ఏర్పాట్లు

మధురవాడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : నూతన విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే (జూన్ 12) నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు అందించడానికి జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 351 ప్రాథమిక పాఠశాలలు, 23 ప్రాథమికోన్నత పాఠశాలలు, 61 ఉన్నత పాఠశాలలు, 3 కేజీబీవీ విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠశాలల పునః ప్రారంభం రోజునే కిట్లు అందించనున్నారు. ఒక్కొక్క కిట్టులో పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫారాలు, బూట్లు, బెల్టు, డిక్షనరీ ఉంటాయి. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటికే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ద్వితీయ సంవత్సరం చదువుతున్న వారికి పాఠ్య, నోట్ పుస్తకాలు అందించారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన తరువాత అందిస్తారు. కిట్ల పంపిణీలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులతో కమిటీలు వేశారు. జిల్లాస్థాయిలో సమగ్ర శిక్ష ఏపీసీ అధ్యక్షుడిగా, సీఎంఓ కన్వీనర్‌గా, జీసీడీఓ, ఎంఐఎస్ కోఆర్డినేటర్‌గా, ఏఎల్‌ఎస్పీఓ సభ్యులుగా వ్యవహరిస్తారు. మండల స్థాయిలో ఎంఈఓ-2, ఎంఈఓ-1, ఎంఐఎస్ కోఆర్డినేటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, సీఎంఆర్‌డీ తదితరులు కమిటీగా ఉంటారు. పాఠశాల స్థాయిలో కూడా కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. హెచ్‌ఎం, విద్యా సహాయకులు, సచివాలయం మహిళా పోలీస్, తల్లిదండ్రుల కమిటీ నుంచి ఇద్దరు సభ్యులు కిట్లు పంపిణీని పర్యవేక్షిస్తారు. కిట్లు యాప్‌లో విద్యార్థుల సంఖ్య, ఎన్ని పంపిణీ చేశారు వంటి వివరాలు నమోదు చేస్తారు.

నేవీ అధికారులకు గీతంలో శిక్షణ

సాగర్‌నగర్/ఎండాడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : భారత నౌకాదళంలో పని చేస్తున్న పరిపాలనా అధికారులకు గీతం వర్సిటీ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో గురువారం నుంచి మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ శిక్షణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ రాజాఫణిపప్పు మాట్లాడుతూ రెండు రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. పరిశ్రమల్లో, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న అధికారులకు సమకాలీన అంశాలపై శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో శిక్షణ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎంఎస్‌వీ ప్రసాద్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ టి. సౌదామిని, డాక్టర్ తపస్సు బంత, ప్రొఫెసర్ వరప్రసాద్, ప్రొఫెసర్ సత్య వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జేసీ వాకర్స్ వార్షికోత్సవం

భీమునిపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చిన్నబజారు జమ్మిచెరువు పార్క్ వాకర్స్ అసోసియేషన్ ద్వితీయ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఉదయం పార్క్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రెగ్యులర్‌గా పార్క్‌కు వాకింగ్‌కు వస్తూ పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్న సీనియరు సిటిజన్స్ కందుకూరి రత్నాజీ దంపతులను, గుడ్ల సత్యనారాయణరెడ్డి, గుర్రాల పండరీనాథ్‌ను సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధి నెయిగాపుల జనార్దన్ రావు మాట్లాడుతూ వాకింగ్ చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను, ఆరోగ్యానికి ఎంతమేలు కలుగుతుందో వివరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఎస్. జోగారావు, డి. ఈశ్వరరావు, కె. అప్పారావు, ఎ. హేమంత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గీతంతో బార్క్ అవగాహన ఒప్పందం

సాగర్‌నగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : బాబా అణుశక్తి పరిశోధన కేంద్రం (బార్క్) ఆకృతి కార్యక్రమాన్ని విశాఖలో అమలు చేయడానికి వీలుగా గీతం వర్సిటీతో గురువారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గీతం వీసీ డాక్టర్ ఎరోల్ డిసౌజా సమక్షంలో రిజిస్ట్రార్ డాక్టర్ డి. గుణశేఖరన్, డీఏఈ టెక్నాలజి ట్రాన్స్‌ఫర్ అండ్ కొలాబరేషన్ డివిజన్ అధిపతి డేనియర్ బాబు అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో బార్క్ ఆకృతి కార్యక్రమ సైంటిఫిక్ ఆఫీసర్ భారతి ఎ.బలేరియా, జి-టెక్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ రాజాఫణిపప్పు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

పాలీసెట్ హాల్ టికెట్లు విడుదల

భీమునిపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ బోర్డు పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ హాల్ టికెట్లు విడుదల చేసినట్టు స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రవేశపరీక్ష ఈనెల 30న జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్ లోడ్ చేసుకోవాలని చెప్పారు. మరింత సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌ను లేదా సమీపంలోని సహాయ కేంద్రాలను సంప్రతించాలని ఆయన సూచించారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటాల వద్ద నివాళి

పద్మనాభం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధి స్థానిక సంస్థల పాలనతోనే సాధ్యమని ఎంపీపీ రాంబాబు అన్నారు. గురువారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో మాట్లాడారు.73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీ రాజ్ సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించడం వల్ల ఏపీ పంచాయతీరాజ్ చట్టం ఏర్పడిందని తెలిపారు. దీనివల్ల బడుగు, బలహీన వర్గాలు, మహిళలకు పాలనలో భాగస్వామ్యం లభించిందన్నారు. గ్రామ, మండల, జిల్లాస్థాయిల్లో మూడంచెలుగా ఏర్పాటైన పంచాయతీరాజ్ వ్యవస్థ ఆవిర్భావానికి ఈ దినోత్సవం మూలకారణమన్నారు. అనంతరం అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటాలకు ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ జయ ఉమ, జూనియర్ సహాయకుడు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో డీసీఎం ఆకస్మిక తనిఖీలు

విశాఖపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రైల్లో ప్రయాణికులకు అందుతున్న సదుపాయాలపై వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె. సందీప్ గురువారం రాత్రి తనిఖీలు చేపట్టారు. రైల్లో ప్రయాణించి ఆన్‌బోర్డు హౌస్ కీపింగ్ సిబ్బంది సేవలను పరిశీలించారు. తాగునీరు, కోచ్‌లు, మరుగుదొడ్లలో శుభ్రతను గమనించారు. ప్యాంటీకార్‌లోకి వెళ్లి ఆహార పదార్థాల నాణ్యత, పరిమాణాన్ని తనిఖీ చేశారు.అనంతరం ప్రయాణికులతో మాట్లాడి పరిశుభ్రత గురించి తెలియజెప్పారు.

పద్మనాభంలో వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం

పద్మనాభం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని కుంతీమాధవ స్వామి ఆలయంలో విద్యార్థులకు గురువారం నుంచి సుపథ జ్ఞాన యజ్ఞం ఉచిత వేసవి తరగతులను ప్రారంభించారు. విద్యార్థులకు సంస్కార శిక్షణ, యోగా, పద్య, శ్లోక పఠనం ద్వారా మాతృభాష పట్ల అనురక్తి, రామాయణం ద్వారా నైతిక, మానవతా విలువలు పెంపుదల, చిత్రలేఖనం, తదితర అంశాలను బోధిస్తారు. ఒకటి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ప్రతి రోజూ రెండు గంటల పాటు నెల రోజులు ఈ తరగతులు నిర్వహించాలని నిర్వాహకులు నిర్ణయించారు.

కళా సాహితి ఆధ్వర్యంలో....

భీమునిపట్నం : కళా సాహితి సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు శుక్రవారం నుంచి వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్టు ఆ సంస్థ అధ్యక్షుడు పీఆర్‌పీ వర్మ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 వరకూ తరగతులు జరుగుతాయన్నారు. ఉదయం పది గంటలకు చిన్నారులకు అల్పాహారం, తాగునీరు అందిస్తామని చెప్పారు. తరగతులను భీమిలిలోని శ్రీనివాసా ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10.30 గంటలకు రామకృష్ణానందస్వామిజీ ప్రారంభిస్తారన్నారు. పర్యావరణ పరిరక్షణ, మానవ విలువలు, పద్యాలు, వ్యక్తిత్వ వికాసం, భక్తిభావం పెంపొందించడం, కార్మిక చట్టాలు, కెరీర్ గైడెన్స్, కథా రచనలో శిక్షణ ఇస్తామన్నారు.



పద్మనాభంలో వేసవి తరగతులకు హాజరైన విద్యార్థులు

ఉక్కు కార్మికులకు అండగా ఉంటా

... 5వ పేజీ తరువాయి

వివరాలను ఆమెకు పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్ వివరించారు. ప్యాకేజీ వల్ల కర్మాగారానికి, కార్మికులకు ఒరిగేదేమీ లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి, తన తాబేదార్లకు కట్టబెట్టాలని మోదీ చూస్తున్నారని ఆరోపించారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా చేపట్టిన ఉద్యమానికి సంపూర్ణ సహకారం అందించాలని షర్మిలను అభ్యర్థించారు. ఉక్కు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. అందుకు ఆమె స్పందిస్తూ కార్మికులకు అండగా ఉంటానని, మరోమారు వచ్చి దీక్షలలో కూర్చుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ, కేఎస్ఎన్ రావు, వరసాల శ్రీనివాసరావు, దొమ్మేటి అప్పారావు, వెంకటేశ్వరరావు, వి.ప్రసాద్, పలువురు ఉక్కు ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు డీఆర్‌సీ సమావేశం

... 5వ పేజీ తరువాయి

సరఫరాలు, పంచాయతీరాజ్, గృహ నిర్మాణ శాఖలపై చర్చకు ప్రతిపాదించారు. జీవీఎంసీకి సంబంధించి నగరంలో వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు, నీటి సరఫరా, యూజీడీ, పారిశుధ్యం, వీధి దీపాలు, టిడ్కో ఇళ్లు, వీఎంఆర్‌డీ మాస్టర్‌ప్లాన్, కొత్త ప్రాజెక్టులపై చర్చించనున్నారు. రెవెన్యూ శాఖ విషయానికి వస్తే ప్రధానంగా ఆక్రమణల క్రమబద్ధీకరణకు సంబంధించి జీవోలు 30, 45, 27 అమలు, ఇంకా సంక్షేమ పథకాల అమలు, డీఆర్‌డీఏ, ఎన్టీఆర్ భరోసా, డ్వామా, ఉపాధి పథకం, నీటి సరఫరా తదితర అంశాలపై అధికారులు నివేదికలు సిద్ధం చేశారు.

ఐటీ భవనాలన్నీ ఖాళీ!

... 5వ పేజీ తరువాయి

ఇచ్చింది. అందులో కూడా ఎటువంటి కార్యకలాపాలు చేపట్టలేదు. ఉపాధి కల్పిస్తామని ఇచ్చిన హామీని పూర్తి చేయకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం విప్రోకు భూమి రిజిస్ట్రేషన్ చేయకుండా ఆపేసింది. ఇప్పటికీ అదే పరిస్థితి కొనసాగుతోంది. అందులో కొన్ని (2, 5, 6) అంతస్థులను ఆరేళ్ల క్రితం 2019లో ఒమిక్స్ ఇంటర్నేషనల్ (పల్సస్) సంస్థకు అద్దెకు ఇవ్వగా వారు దాదాపు వెయ్యి మందికి ఉపాధి కల్పించారు. అయితే అక్కడి నుంచి ఐటీ ఉత్పత్తులను విదేశాలకు రాయితీపై ఎగుమతి చేసుకునే అవకాశం లేకపోవడంతో ఆ సంస్థ కూడా కొద్ది కాలానికే ఖాళీ చేసి వెళ్లిపోయింది. ఒమిక్స్ అద్దెకు తీసుకున్న భవనం సెజ్ పరిధిలో లేకపోవడమే దీనికి కారణం. అంతకుముందు విప్రోతో లీజు ఒప్పందానికి ఒమిక్స్ యత్నించింది. ఆ భూమి విప్రో పేరుతో లేదని రిజిస్ట్రేషన్ల శాఖ తిరస్కరించింది. దాంతో ఒమిక్స్ ఆ ప్రాంగణం ఖాళీ చేసింది. తాజాగా ఈ నెల మొదటి వారంలో తమను మోసం చేశారంటూ విప్రోపై ద్వారకానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టింది. విదేశాలకు ఐటీ ఎగుమతులు చేసుకునే అవకాశం లేకపోవడంతో దాదాపు రూ. 200 కోట్ల వరకు నష్టపోయామని ఆరోపించింది. ప్రస్తుతం విప్రో చేతిలో ఏడు ఎకరాలు ఉండగా, నామమాత్రపు ఉద్యోగులతోనే నడుస్తోంది.

కేజీహెచ్ వైద్యులకు షోకాజ్

... 5వ పేజీ తరువాయి

ఉన్నట్టు గుర్తించారు. వారికి షోకాజ్ నోటీసులు జారీచేయాలని ఆయన ఆదేశించారు. ఈ మేరకు ఆస్పత్రి అధికారులు ఎమర్జన్సీ మెడిసన్ విభాగాధిపతి డాక్టర్ వీఎస్ఎన్ మూర్తి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.నరసింగరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.కిరణ్‌కుమార్, క్యాజువాల్టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జేఎస్‌కేవై చక్రవర్తి, అనస్థీషియా టెక్నీషియన్ డాక్టర్ సీహెచ్ అమర్‌బాబు, హెడ్ నర్స్ కె.సుజాతకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. దీనికి సంబంధించి వారి నుంచి వివరణ తీసుకున్న తరువాత చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

సాదాసీదాగా ఏయూ శతాబ్ది వేడుకలు ప్రారంభం?

... 5వ పేజీ తరువాయి

వీసీకి చెప్పినట్టు తెలిసింది. దీంతో అధికారులు ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తిని ముఖ్య అతిథిగా, కేరళలోని పాలక్కాడ్ ఐఐటీ డైరెక్టర్ ఎ.శేషాద్రి శేఖర్‌ను గౌరవ అతిథిగా ఆహ్వానించారు. ఈ నెల 26న బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే శతాబ్ది వేడుకల ప్రారంభోత్సవ కార్యక్రమానికి వీరు హాజరుకానున్నారు. అదేరోజు ఉదయం బీచ్ రోడ్డులో వాక్‌థాన్ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ జెండా ఊపి ప్రారంభిస్తారు. అలాగే, ఏయూలో వందేళ్ల ఉత్సవాలకు సంబంధించిన బెలూన్ ఎగురవేసే కార్యక్రమాన్ని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ చేపడతారు. మిగిలిన కార్యక్రమాలన్నీ పూర్తిగా ఏయూ అధికారులు ఆధ్వర్యంలో జరగనున్నాయి. వేడుకలను సాదాసీదాగా ప్రారంభించడంపై వర్సిటీ వర్గాలు పెదవివిరుస్తున్నాయి. అదే సమయంలో దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో ఒకటైన ఏయూ వందేళ్ల వేడుకల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వమే తీసుకుని కమిటీ ఏర్పాటు చేసి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం అధ్యాపకవర్గాల్లో వ్యక్తమవుతోంది.



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విద్యార్థులు

అవంతి విద్యార్థుల కొవ్వొత్తుల ర్యాలీ

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు గురువారం రాత్రి కళాశాల ఆవరణలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కశ్మీరులో జరిగిన ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతిచేకూరాలని కోరుతూ మౌన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, కళాశాల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టీసీ కండక్టర్ నిజాయితీ

సింహాచలం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం ఆర్‌టీసీ డిపోలో పనిచేస్తున్న కండక్టర్ బస్సులో తనకు దొరికిన సెల్‌ఫోన్‌ను బాధితుడికి అందజేసి, పలువురి ప్రసంశలు పొందారు. డిపో మేనేజర్ రాజశేఖర్ తెలిపిన వివరాలు ప్రకారం...ఒడిశాకు చెందిన ప్రయాణికుడు గురువారం స్వామివారి దర్శనానికి వచ్చాడు. అనంతరం బస్సులో కొండదిగువకు వచ్చి సెల్‌ఫోన్ మరిచిపోయాడు. బస్సులో ఉన్న ఫోన్‌ను కండక్టర్ బాబు స్వాధీనం చేసుకున్నారు. ఇంతలో బాధితుడు ఆ నంబర్‌కు ఫోన్ చేయగా కండక్టర్ సెల్‌ఫోన్‌ను డిపో మేనేజర్ సమక్షంలో అతనికి అందజేశారు.

ఇరుకు గదిలో పోలీస్ ఔట్ పోస్టు



తగరపువలస కూడలిలో ఉన్న ఔట్‌పోస్టు

తగరపువలస, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస కూడలిలో ఉన్న పోలీసు ఓట్‌పోస్టును ఇరుకు గదిలో నిర్వహిస్తుండడంతో సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. జూట్‌మిల్లు తిరిగిన సమయంలో మిల్లుకు సమీపంలో సొంత భవనంలో ఈ స్టేషన్‌ను నిర్వహించేవారు. తరువాత అందరికీ అందుబాటులో ఉంటుందని తగరపువలస కూడలికి మార్చారు. విశాఖకు వెళ్లే మార్గంలో పాత బస్ షెల్టర్ తొలగించి, చిన్న గదిలో తాత్కాలికంగా ఈ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో నలుగురు కూర్చోవడానికి కూడా అవకాశం లేదు. స్టేషన్ ఏర్పాటు చేసి పదేళ్లు కావస్తున్నా.. ఇప్పటికీ అందులోనే నిర్వహిస్తున్నారు.

ఈ స్టేషన్ భీమిలి పోలీసు స్టేషన్‌కు అనుబంధంగా పనిచేస్తోంది. దీనికి సిబ్బందిని కూడా పూర్తిస్థాయిలో కేటాయించలేదు. భీమిలి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగే అత్యధిక నేరాలు, ప్రమాదాలు అన్నీ తగరపువలస జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రామాల్లోనే ఎక్కువగా జరుగుతుంటాయి. స్టేషన్‌లో తక్కువ మంది సిబ్బంది ఉండడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. భీమిలి పోలీసు స్టేషన్‌లో ట్రాఫిక్, లా అండ్ అర్డర్, క్రైమ్ ఎస్‌ఐలు, సిబ్బంది అంతా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో పనిచేస్తున్నారు. ఈ మూడింటిలో ఒక విభాగాన్ని తగరపువలసకు తరలించి ఔటు పోస్టును పూర్తిస్థాయి స్టేషన్‌గా మార్పు చేస్తే చాలా ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. భీమిలి క్రాస్ రోడ్డులో గతంలో ఉన్న ఔటు పోస్టు స్టేషన్‌ను మార్పు చేసిన విధంగా దీన్ని కూడా మార్పు చేయాలని కోరుతున్నారు.

27 నుంచి బహుభాషా నృత్య శిక్షణ శిబిరం

వెంకోజీపాలెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి బహుభాషా నృత్య విభాగంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు డైరెక్టర్ ఆర్.జానకి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎంటీసీ కాలనీ ఏపీఎస్ఈబీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో ప్రతి ఆదివారం మధ్నాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు పది నుంచి పదహారేళ్ల లోపు బాలబాలికలకు బహుభాషా నృత్యాల్లో శిక్షణ ఇస్తామన్నారు. జూన్ 10 వరకు ప్రతి జరిగే ఈ తరగతుల్లో నృత్యాంశాలు నేర్పిస్తామన్నారు. నృత్య అనుభవం ఉండి త్వరగా నేర్చుకున్న బాల కళాకారులకు వెంటనే ప్రదర్శన అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తిగల జిల్లాకు చెందిన బాలలు ఈ నెల 27 లోపు ఫోన్ నెం.8522990123లో సంప్రదించి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. జూన్ 10న శిబిరం ముగుస్తుందన్నారు.

సత్యసాయి ఆరాధనోత్సవం

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయిబాబా 14వ ఆరాధన మహోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. సత్యసాయి సేవాసంస్థలు, విశాఖ జిల్లా సత్యసాయి సేవా సమితి, సిటీ సమితి సంయుక్తంగా ఎంవీపీ కాలనీలోని ప్రేమసదన్ మందిరంలో గురువారం తెల్లవారుజాము నుంచే కార్యక్రమాలు చేపట్టారు. ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, రుద్రాభిషేకం, శ్రీసత్యసాయి సహస్రనామ పుష్పార్చన, విశ్వమానవ కల్యాణం, శ్రీసత్యసాయి గాయత్రీ విశ్వశాంతి హోమం అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. మధ్యాహ్నం నారాయణ సేవ జరిగింది. సాయంత్రం వేదపఠనం, సిటీ సమితి గాయనీగాయకుల నామ సంకీర్తన, సత్యసాయి విద్యా విహార్ మేథమెటిక్స్ విభాగాధిపతి బగ్గం సురేష్ ఆధ్యాత్మిక ప్రసంగం, మంగళహారతితో ఉత్సవాలు ముగించారు.విద్యావిహార్ పదో తరగతి విద్యార్థులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.నిరాశ్రయులకు మజ్జిగ, అరటిపండ్లు, బిస్కెట్లు వంటివి అందించారు. అనాథాశ్రమానికి బియ్యం, కూరగాయలు, నూనె తదితర నిత్యావసరాలు అందజేశారు. జిల్లా అధ్యక్షుడు నాయుడు, కన్వీనర్ సీతారామరాజు తదితరులు పర్యవేక్షించారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

వెంకోజీపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సహచర క్రీడాకారుడు, గురువు పల్లా పైడిరాజు జ్ఞాపకార్థం 16వ వార్డు హెచ్‌బీ కాలనీ అబ్దుల్ కలాం పార్కులోని కోర్టు -2లో పైడిరాజు మెమోరియల్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. 15 జట్లు పాల్గొన్నాయి. ఉదయం, సాయంత్రం ఈ పోటీల్లో పాల్గొన్న జట్లకు లీగ్ మ్యాచ్‌లు నిర్వహించారు. శుక్రవారం ఉదయం సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించి, విజేతలకు జ్ఞాపికలు బహూకరిస్తామని నిర్వాహకులు తెలిపారు. తమ గురువైన పైడిరాజు గత ఏడాది అకాల మరణం పొందారని, ఆయన నేర్పిన విద్యతో తాము ప్రతి రోజు షటిల్ ఆడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పల్లా శ్రీను, పల్లా శివ, ప్రసాద్, ఒమ్మి కోటి, ఒమ్మి జగ్గారావు, వంశీ, చిన్న, పల్లా ప్రసన్న, మహేష్, మణి, జనసేన నాయకులు పీల వెంకట పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **సారంగపాణి జాతకం :** శారద, శ్రీరామ, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)
- **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 10, వంకాయలు (తెలుపు) 15, వంకాయలు (నలుపు) 15, బెండకాయలు 20, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 30, బీరకాయలు 32, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 24, క్యాబేజీ 14, క్యారెట్ 32 దొండకాయలు 16, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది)48, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 52, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100,కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, కీరదోస 22, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 36, కంద 80, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 28, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

గోవింద నామాలతో టీటీడీ కూడలి ముస్తాబు

- రూ.1.44 కోట్ల స్మార్ట్ సిటీ నిధులు మంజూరు
- 80 శాతం పనులు పూర్తి


టీటీడీ కూడలి వద్ద ఏర్పాటు చేసిన గోవింద నామాలు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని పలు కూడళ్లలో స్మార్ట్ సిటీ నిధులతో ఆకర్షణీయమైన సర్కిళ్లు నిర్మిస్తున్నారు. ముఖ్యంగా కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద ఉన్న సర్కిల్‌ను అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ పనులు దాదాపు పూర్తికావొచ్చాయి.ఇక్కడ టీటీడీ కూడలిగా పేరొందడంతో ఆపేరుకు తగ్గట్లే సర్కిల్‌ను ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దారు. నాలుగు రోడ్ల కూడలి కావడంతో మధ్యలో గోవింద నామాలతో తీర్చిదిద్దాలని నిర్ణయించారు. దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయి. గోవింద నామాలను ఇప్పటికే అమర్చేశారు. వాటర్ ఫౌంటెన్‌లు, విద్యుత్తు దీపాలు, పచ్చదనం వంటివి ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ కూడలి నిర్మాణానికి రూ.1.44 కోట్లు మంజూరయ్యాయి. సర్కిల్ చుట్టూ రోడ్డును తవ్వి, అందంగా కనిపించడానికి స్టోన్ రోడ్డు నిర్మించారు. ఇసుకతోట, బీచ్ రోడ్డుల నుంచి వచ్చేటప్పుడు రెండు వైపులా కనిపించేలా శంఖు, చక్ర, నామాలను అమర్చారు. ఫౌంటెన్‌లు, విద్యుత్తు దీపాలు అమర్చాల్సి ఉంది. టీటీడీ కల్యాణమండపంలో నిత్యం ఏదో ఒక కార్యక్రమం జరుగుతుంది. అక్కడ కల్యాణ బాజాలు సాధారణం కాగా,పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ శంఖు, చక్ర, నామాలతో కూడలిని తీర్చిదిద్దడం పట్ల ఈ ప్రాంతీయుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

'ఉగ్రవాదాన్ని అందరూ వ్యతిరేకించాలి'


శాంతియుత నిరసన ర్యాలీలో పాల్గొన్న ఏయూ ఉద్యోగులు, విద్యార్థులు

విశాఖపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కుల, మతాలకు అతీతంగా ఉగ్రవాదాన్ని ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని, మతాలు వారీగా విడిపోయి కొట్లాడుకునే సమయం ఇది కాదని పలువురు పేర్కొన్నారు. కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ ఏయూ ప్రధాన గేటు వద్ద ఆంధ్ర యూనివర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులు శాంతియుత నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారంతా ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, విద్యార్థులు మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడి ఘటన నేపథ్యంలో దేశమంతా ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు.ఇప్పుడు కశ్మీర్‌లో జరిగిన ఘటన రేపు ఎక్కడైనా జరుగుతుందని, కాబట్టి దేశ ప్రజలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఏయూలో ఫైనాన్స్ ఆఫీసర్ సూర్యారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ సాంబమూర్తి, పైడి శ్రీనివాస్, అమరేందర్, సాయి బలరామ్, బొట్టా రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

'భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి'

సిరిపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ గురువారం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ మాట్లాడుతూ సుమారు 30 లక్షల మంది భవన నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డు ద్వారా అనేక సంవత్సరాలుగా అమలవుతున్న సంక్షేమ పథకాలను ఆపేస్తూ గత వైసీపీ ప్రభుత్వం 1214 మెమో జారీ చేసిందన్నారు. ఫలితంగా లక్షలాది మంది కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. ఎన్నికలకు ముందు టీడీపీ హామీ ఇచ్చినట్టుగా రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి, సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెంకట్రావు, అధ్యక్షులు అనసూయ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, రాము నాయుడు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్ రోడ్డులో పుష్ప సోయగాలు


బీఆర్‌టీఎస్ రోడ్డులో ఓ చెట్టు నిండా పూలు

ఆరిలోవ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ముడసర్లోవ పార్కు సమీపంలో చెట్లు ఎత్తుగా, గుబురుగా పెరిగాయి. ఆ చెట్లకు పూసిన స్వర్ణ రంగు పుష్పాలు బాటసారులు, పార్కు సందర్శకులను ఎంతగానో అలరిస్తున్నాయి. ఈ మార్గంలో ప్రయాణించేవారికి నయనానందకరంగా కనిపిస్తూ వాహనచోదకుల మనసు దోచుకుంటున్నాయి. శ్రీకృష్ణాపురం ఎలిమెంటరీ స్కూలు సమీపంలో ఊదా రంగు పూల సోయగం మనోరంజకంగా కనిపిస్తోంది. బీఆర్‌టీఎస్ రోడ్డు చినగదిలి వద్ద లేత గులాబీ రంగులో వికసిస్తూ, పరిమళాలు వెదజల్లుతున్నాయి. ఈ చెట్లను సుమారు ఏడేళ్ల క్రితం ప్రభుత్వం రోడ్లకు ఇరువైపులా నాటించింది. మండు వేసవిలో బీఆర్‌టీఎస్ రోడ్డులో సాయంత్రం ప్రయాణం ఎంతో ఆనందాన్నిస్తుందని పలువురు వాహన చోదకులు అంటున్నారు.

అర్జీలు 45 రోజుల్లోగా పరిష్కరించాలి

వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్



వినతులపై అధికారులతో సమీక్షిస్తున్న చైర్మన్ ప్రణవ్ గోపాల్

సిరిపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజాదర్బార్‌కు వచ్చిన అర్జీలను 45 రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం వీఎంఆర్డీఏ కార్యాలయంలో ఇప్పటి వరకు వచ్చిన మొత్తం వినతులపై అన్ని విభాగాధిపతులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత ప్రజా సమస్యల పరిష్కారమన్నారు. ఇప్పటి వరకు వచ్చిన వినతులకు ఎట్టి పరిస్థితుల్లో పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాదర్బార్‌లో ఇచ్చిన అర్జీలకు 45 రోజుల్లో పూర్తిస్థాయిలో సమాధానం ఇవ్వాలని చెప్పారు. ప్రధానంగా భూ సంబంధిత వినతుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, డీఎఫ్ఓ సుజాతాశివానీ, ఎస్టేట్ అధికారి దయానిధి, ఎల్ఏఓ వేణుగోపాల్, పరిపాలనాధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




ఓ కంపెనీ ప్రతినిధికి జ్ఞాపిక అందజేస్తున్న ఎంపీ శ్రీభరత్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పక్కన మెగా జాబ్ మేళాకు హాజరైన యువతీ యువకులు

యువత చేతిలోనే దేశ భవిష్యత్తు : ఎంపీ శ్రీభరత్

- ఉపాధి అవకాశాల మెరుగుకు ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యం గల యువతే దేశాభివృద్ధికి పునాదులని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ యువత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు నిర్వహించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేం దుకు కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాలకు విశేష స్పందన వస్తుందని పేర్కొన్నారు. అనంతరం మేళాలో పాల్గొన్న సుమారు 60 కంపెనీల ప్రతినిధులకు ఎంపీ, కలెక్టర్ జ్ఞాపికలను అందజేశారు.ఈ జాబ్ మేళాలో సుమారు మూడు వేల మంది అభ్యర్థులు పాల్గొనగా వెయ్యి మందికి కొలువులు లభించాయి. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఏపీసీపీఎస్‌జీఎఫ్ఎల్ చైర్మన్ గండి గండి బాబ్జీ, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉర్సాకు భూ కేటాయింపులు రద్దు చేయాలి

విశాఖపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : డేటా సెంటర్ ముసుగులో ప్రభుత్వం ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే డొల్ల సంస్థకు భూ కేటాయింపులను సీపీఎం వ్యతిరేకిస్తోందని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పేర్కొన్నారు. సంస్థకు ఏకంగా 60 ఎకరాల విలువైన భూమిని కేటాయించడం రాజకీయ అవినీతేనన్నారు. అక్రమ కేటాయింపులను తక్షణమే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారాం, భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తితో కలిసి గురువారం కాపులుప్పాడ ఐటీహిల్ -3లో ఉర్సాకు కేటాయించిన భూములను పరిశీలించింది. దీనివిలువ సుమారు రూ.3 వేల కోట్లు ఉంటుందని, రూ.5,278 కోట్ల పెట్టుబడితో డేటా సెంటర్ నెలకొల్పుతామని, 2,500 మందికి ఉద్యోగాలు వస్తాయని చేసిన ప్రకటన నమ్మశక్యంగా లేదనిన్నారు. అమెరికాలో గతేడాది సెప్టెంబరు 27న, ఈ ఏడాది ఫిబ్రవరి 12న సంస్థను రిజిస్టర్ చేశారని, అధీకృత పెట్టుబడిగా రూ.10 లక్షలు మాత్రమే చూపిందనిన్నారు. ప్రభుత్వంలోని కొందరికి ఇది బినామీ సంస్థని ఆరోపించారు. ఈ సంస్థ వెనుక విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఉన్నారని, అతని బినామీ అబ్బూరి సతీష్ డైరెక్టర్ అని పేర్కొన్నారు.

కార్పొరేటరు ఇంటిపై దాడి.. కేసు నమోదు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పదిహేడో వార్డు కార్పొరేటరు గేదెల లావణ్య ఇంటిపై దాడికి యత్నించిన ఘటనలో ఆమె భర్త ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం రాత్రి పెదవాల్తేరుదబ్లైవారి వీధిలో ఉంటున్న కార్పొరేటరు లావణ్య, ఆమె భర్త నాగరాజు ఇంట్లో లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దాడికి యత్నించారు. పూలకుండీలను ధ్వంసం చేసి వెళ్లిపోయారు. నాగరాజు తల్లిదండ్రులను అసభ్యంగా తిట్టారు. కొద్ది రోజుల క్రితం తనను బెదిరించిన వారిపై అనుమానం ఉన్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఎస్‌ఐ ధనుంజయ నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫొటోగ్రాఫర్‌పై దాడి

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఓ దినపత్రిక ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ ఆదిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఫొటోగ్రాఫర్ రాజేష్ ద్విచక్రవాహనంపై కుమారుడిని పాఠశాల నుంచి తీసుకుని వస్తుండగా, డీఆర్‌డీఏ సమీపంలోకి వచ్చేసరికి ఏపీ39బిడి 3610 నెంబరు గల ఆటో ఢీకొట్టింది. ఆటో డ్రైవర్‌ను ప్రశ్నించగా, మద్యం తాగి ఉన్న ఇద్దరు వచ్చి, రాజేష్‌పై దాడి చేశారు. సమీపంలో ఉన్న సాయికృష్ణ అడ్డుకోవడానికి ప్రయత్నించగా, అతడిపై దాడి చేశారు. రాజేష్ ఫిర్యాదు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెమిస్టర్ పరీక్షలకు అనుమతి ఇవ్వాలని ఆందోళన

విశాఖపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఏయూలోని ఇంజనీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్, సివిల్ ఇంజ నీరింగ్ మొదటి ఏడాది రెండో సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు కొందరు వీసీ కార్యాలయం ఎదుట గురువారం సాయంత్రం ఆందోళన నిర్వహించారు. ఈ రెండు విభాగాలకు చెందిన 30 మంది విద్యార్థులకు హాజరు తక్కువగా ఉందని పరీక్షలకు అనుమతించలేదు. దీంతో వారు తమను పరీక్షలకు అనుమతించాలని ఆందోళన చేశారు. 60 శాతం కంటే తక్కువ ఉన్న వారిని పరీక్షలకు ఆపినట్టు చెబుతున్నారని, కానీ, 40 శాతం కంటే తక్కువ హాజరు ఉన్న విద్యార్థులు కూడా పరీక్షలకు హాజరైనట్టు వారు తెలిపారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరి గిన వెంకటరమణ, అభిషేక్, సంజు, వికాస్ పాల్గొన్నారు.

పాలీసెట్ హాల్ టికెట్లు విడుదల

భీమునిపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ బోర్డు పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ హాల్ టికెట్లు విడుదల చేసినట్టు స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రవేశపరీక్ష ఈనెల 30న జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్ లోడ్ చేసుకోవాలని చెప్పారు. మరింత సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌ను లేదా సమీపంలోని సహాయ కేంద్రాలను సంప్రతించాలని ఆయన సూచించారు.

పోలమాంబ హుండీల ఆదాయం రూ.2.93 లక్షలు

పెదవాల్తేరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థానంలో గురువారం హుండీల కానుకలు లెక్కించారు.ఏడు రోజలకు రూ.2,93,258 నగదు, 14 గ్రాముల బంగారం,280 గ్రాముల వెండి వచ్చినట్లు దేవస్థానం ఈవో కె.గాయిత్రి తెలిపారు. దేవదాయ శాఖ పర్యవేక్షణ అధికారిగా అల్లు జగన్నాథం, పెదవాల్తేరు గ్రామ సంఘం, ఉత్సవ కమిటీ సభ్యులు, త్రీ టౌన్ పోలీసులు, శ్రీహరిసేవ సభ్యులు, రెవెన్యూ, ఆలయ సిబ్బంది ఇందులో పాల్గొన్నారు.

ఏయూలో నృత్య దినోత్సవ వర్క్‌షాప్


వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నృత్య దినోత్సవం సందర్భంగా రెండు రోజుల వర్క్ షాప్ ఏయూలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ఏయూ శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇలాంటి వర్క్‌షాప్‌లు నిర్వహించడం మంచి విషయమన్నారు. ఏయూ, ఇతర కళాశాలల నుంచి సుమారు వంద మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వర్క్‌షాప్ కన్వీనర్ ఆచార్య ఎ.అనురాధ, విభాగపు ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర కారాగారం డెయిరీ ఫారంలో 26న వేలం

ఆరిలోవ. ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కారాగారం డెయిరీ ఫారంలోని పరేడ్ మైదానంలో 14 పశువులకు ఈ నెల 26న ఉదయం 10 గంటలకు వేలం జరుగుతుందని సూపరింటెండెంట్ మహేష్‌బాబు తెలిపారు. ఔత్సాహికులు రూ.1,500 ధరావతు చెల్లించాలన్నారు. ఆవు 1, ఆడదూడలు 5, గేదె 1, దున్నదూడలు 7 వేలం వేస్తామన్నారు. కారాగారం ఆవరణలో మామిడి పంటను కూడా ఆదే రోజు వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం రూ.వెయ్యి ధరావతు చెల్లించాలన్నారు. పాట పాడిన వారు వెంటనే సొమ్ము చెల్లించవలసి ఉంటుందన్నారు.

వైసీపీ నూతన జిల్లా అధ్యక్షులకు సన్మానం


గుడివాడ అమర్‌నాథ్, కేకే రాజును పూలమాలతో సన్మానిస్తున్న కార్పొరేటర్లు

మద్దిలపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి, విశాఖ జిల్లాల వైసీపీ అధ్యక్షులుగా నియమితులైన గుడివాడ అమర్‌నాథ్, కెకె రాజులను మద్దిలపాలెంలోని వైసీపీ కార్యాలయంలో గురువారం ఆ పార్టీ కార్పొరేటర్లు గజమాలతో సన్మానించారు. పార్టీ బలోపేతానికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని నేతలు అన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంఎస్‌కె ప్రసాద్ జన్మదిన వేడుకలు


దివ్యాంగుల నడుమ కేక్ కట్ చేస్తున్న ఫిజికల్ డైరెక్టర్ ఎం.విజయ మోహన్

పెదవాల్తేరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): హిడెన్ స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో భారత క్రికెట్ జట్టు మాజీ సెలెక్టర్ ఎంఎస్‌కె ప్రసాద్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంఎస్‌కె స్నేహితులు కిషోర్, శ్రీధర్‌ల సమక్షంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏయూ ఫిజికల్ డైరెక్టర్ విజయమోహన్ పాల్గొని దివ్యాంగులతో కలిసి కేకు కోశారు. అనంతరం దివ్యాంగులకు భోజనాలు ఏర్పాటు చేశారు. మానసిక దివ్యాంగ పిల్లలంతా ఎంఎస్‌కె ప్రసాద్‌కు వీడియో కాల్‌లో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల నిర్వాహకుడు కండిపిల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ జన్మదిన వేడుకలు ప్రతి సంవత్సరం మానసిక దివ్యాంగుల నడుమ జరుపుకోవటం అయనకు ఎంతో ఆనందాన్ని కలుగజేస్తుందన్నారు. ఇలాంటి పిల్లలకు ఉచితంగా సేవలు చేస్తున్న నిర్వాహకుడు కండిపిల్లి శ్రీనివాసరావు, అతని సిబ్బందికి ఎంఎస్‌కే ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యమైన విద్యతో మెరుగైన ఫలితాలు


విద్యార్థులను అభినందిస్తున్న ఆర్‌జేడీ విజయ్‌భాస్కర్

మధురవాడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించినప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయని విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజ య్‌భాస్కర్ అన్నారు. గురు వారం అడవివరం జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆర్‌జేడీని మధురవాడ లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి విష్ణువర్ధన్‌సాయి 588, కవిత 574 మార్కులు సాధించడం అభినందనీయన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తే మంచి ఫలితాలు వస్తాయని, అందుకు ఈ ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షా ఫలితాలే నిదర్శనమని చెప్పారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల హెచ్‌ఎం ఇమంది పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

'భారత్ అభివృద్ధిని ఓర్వలేని పాకిస్థాన్ ఉగ్ర పన్నాగమిది'


డాబాగార్డెన్స్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద చంద్రమౌళి చిత్రపటం పట్టుకుని బైఠాయించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, జనసేన నాయకులు



కంచరపాలెం మెట్టు వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న పశ్చిమ జనసేన ఇన్‌చార్జి అంక ప్రశాంతి, జనసైనికులు


అక్కయ్యపాలెం ఎనభై అడుగుల రోడ్డులో మోకాళ్లపై నిరసన వ్యక్తంచేస్తున్న పసుపులేటి కల్పన, జనసైనికులు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన దాడిలో మరణించిన నగర వాసి చంద్రమౌళికి విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ సంతాపం తెలిపారు. గురువారం సాయంత్రం డాబాగార్డెన్స్ ఎల్ఐసీ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర చంద్రమౌళి చిత్రపటాన్ని పట్టుకుని నల్లరిబ్బన్లు ధరించి కూటమి నాయకులతో కలిసి మౌనప్రదర్శన చేశారు. భారతదేశ అభివృద్ధిని చూసి ఓర్వలేక పాకిస్థాన్ ఇటువంటి పిరికిపంద చర్యలకు ఒడిగట్టిందని వంశీకృష్ణ దుయ్యబట్టారు. ప్రతి భారతీయుడు ఈ చర్యను ఖండిస్తూ, మృతులకు సంతాపం తెలపాలని కోరారు. ఉగ్ర దాడిని ఖండిస్తూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు మూడు రోజులు సంతాప దినాలు పాటించాలని నిర్ణయించామని ఎమ్మెల్యే అన్నారు. ఉగ్రవాదులను శిక్షించాలంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు.

చంద్రమౌళి సేవలు గొప్పవి

ఉగ్రదాడిలో మరణించిన విశాఖ వాసి చంద్రమౌళికి వైజాగ్ చిల్డ్రన్ క్లబ్, ఆసరా చారిటబుల్ సొసైటీ సభ్యులు నివాళులర్పించారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో వీసీసీ, ఆసరా సంయుక్త ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. వీసీసీ వ్యవస్థాపకురాలు కె.రమాప్రభ మాట్లాడుతూ చంద్రమౌళి స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్నప్పటి నుంచి ఆసరా చారిటబుల్ సొసైటీ సభ్యులుగా పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవారని చెప్పారు. ఈసీ సంజీవ్‌కుమార్, సుధ, శోభ, సుశీల పాల్గొన్నారు.

మెట్టువద్ద కొవ్వొత్తులతో నిరసన

కంచరపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉగ్రమూకలు విచక్షణ రహితంగా కాల్పులు జరిపి పర్యాటకులను పొట్టనబెట్టుకున్న దారుణ ఘటనను ఖండిస్తూ పశ్చిమ నియోజకవర్గం జనసైనికులు గురువారం రాత్రి కంచరపాలెంలోని మెట్టు వద్ద కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన నగరవాసి చంద్రమౌళి మృతికి మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థన చేశారు. పశ్చిమ నియోజక వర్గం జనసేన నాయకురాలు అంక ప్రశాంతి మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అప్రమత్తం కావాలని కేంద్రానికి సూచించారు. 56వ వార్డు జనసేన నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెంటకోట శివ, బీశెట్టి వెంకటరావు, మల్ల బలరాం తదితరులు పాల్గొన్నారు.

పాకిస్థాన్‌ది పిరికిపంద చర్య

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అమాయక ప్రజలను ఉగ్రవాదులు కాల్చి చంపడం పిరికిపంద చర్యగా జనసేన పార్టీ ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషాకిరణ్ మండిపడ్డారు. అక్కయ్యపాలెం ఎనభై అడుగుల రోడ్డు జంక్షన్‌లో జనసేన నాయకులు నోటికి నల్ల రిబ్బన్ కట్టుకుని మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, 26, 42, 43, 44 వార్డుల జనసేన అధ్యక్షులు బండి కనకరాజు, నాగమణి, గారపాటి లక్ష్మి, పడాల పరమేశ్వర రావు, బొడసింగి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అబిద్‌నగర్ నివాసితుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో


చంద్రమౌళి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన చంద్రమౌళికి అబిద్‌నగర్ నివాసితుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్‌బే పార్కులో సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలువేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు ఎస్‌వీవీ రాజు మాట్లాడుతూ సమాజం మంచి సేవకుడిని కోల్పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో సోమశేఖర్, శ్యాంప్రసాద్, వాకర్లు పాల్గొన్నారు.

రైళ్లలో డీసీఎం ఆకస్మిక తనిఖీలు


ప్యాంటీకార్‌లో తనిఖీ చేస్తున్న సీనియర్ డీసీఎం సందీప్

విశాఖపట్నం, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): రైల్లో ప్రయాణికులకు అందుతున్న సదుపాయాలపై వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ గురువారం రాత్రి తనిఖీలు చేపట్టారు. రైల్లో ప్రయాణించి ఆన్‌బోర్డు హౌస్ కీపింగ్ సిబ్బంది సేవలను పరిశీలించారు. తాగునీరు, కోచ్‌లు, మరుగుదొడ్లలో శుభ్రతను గమనించారు. ప్యాంటీకార్‌లోకి వెళ్లి ఆహార పదార్థాల నాణ్యత, పరిమాణాన్ని తనిఖీ చేశారు. అనంతరం ప్రయాణికులతో మాట్లాడి పరిశుభ్రత పాటించాల్సిన అవసరాన్ని తెలియజెప్పారు. ప్రయాణ సమయంలో వస్తువుల జాగ్రత్త, అనుమానితులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిని, నిషేధ వస్తువులను గుర్తిస్తే వెంటనే హెల్ప్ లైను నంబరు 139కు ఫోన్ చేసి సమాచారమివ్వాలన్నారు. ఆరు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న 163 మందిని డీసీఎం పట్టుకుని వారి నుంచి జరిమానా రూపంలో రూ.లక్ష వసూలు చేశారు.

వనరుల కేంద్రంలో సిబ్బంది లేక అవస్థలు

- సీఆర్పీలపై అదనపు భారం
- అర్బన్ మండలాల్లో పరిస్థితి మరీ దారుణం
- ఒకే మండలంలో ముగ్గురు సిబ్బంది
- మూడు మండలాల్లో ఒకరూ లేరు.
- డేటా పంపడంలో తీవ్ర జాప్యం
- ఉన్నవారిని సర్దుబాటు చేయాలని విజ్ఞప్తి



అక్కయ్యపాలెంలో గల సీతమ్మధార మండల వనరుల కేంద్రం

కంచరపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఏడాది క్రితం నూతనంగా ఏర్పడిన విశాఖపట్టణం అర్బన్ మండలాలు గోపాలపట్టణం, మహారాణిపేట, ములగాడ, సీతమ్మధారలలో క్లరికల్ సిబ్బంది లేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మండల వనరుల కేంద్రం నుంచి అవసరమైన డేటాను విద్యాశాఖకు పంపడంలో సిబ్బంది లేక ఉన్న సీఆర్పీలమీదే భారం పడుతోంది. గతంలో విశాఖ అర్బన్ అంతా ఒకే మండలంగా ఉండేది. ప్రస్తుతం అర్బన్ నాలుగు మండలాలు సీతమ్మధార, గోపాలపట్టణం, మహారాణిపేట, ములగాడగా విడిపోయింది. అయితే అర్బన్ అంతా ఒకే మండలంగా ఉన్నప్పుడు క్లరికల్ సిబ్బంది ఎంఐఎస్ కో-ఆర్డినేటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, అక్కౌంటెంట్‌లు పనిచేశారు. ప్రస్తుతం వీరు సీతమ్మధార మండలంలో ఉండి ఆ ఒక్క మండలానికే పరిమితమయ్యారు. మిగిలిన మండలాల్లో ఒక్కరినీ నియమించలేదు. దీంతో ఆయా కేంద్రాల్లో విధులు చేపడుతున్న సీఆర్పీలే పాఠశాలలను సందర్శించడం, డేటాను సేకరించడం చేస్తున్నారు. సేకరించిన డేటాను సీఆర్పీలే అప్‌లోడ్ చేయాల్సి రావడంతో పనిభారం అధికమవుతుంది. కొత్త మండలాలనైతే ఏర్పాటు చేశారు గాని, కనీసం సిబ్బందిని నియమించడంలో గత ప్రభుత్వం దృష్టి సారించలేదు. ఫలితంగా ఉన్న సీఆర్పీలపైనే అదనపు భారం పడుతుంది. అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి ఒకే మండలానికి పరిమితమై ఉన్న ముగ్గురు క్లరికల్ సిబ్బందిని సర్దుబాటు చేయాలని కోరుతున్నారు. ఈ అకాడమిక్ విద్యాసంవత్సరానికి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి కిట్లు ఆయా మండలాలకు చేరుతున్నాయి. వీటిని పాఠశాలలకు పంపిణీ చేయడం, బిల్లులు సిద్ధం చేయడం తదితర పనులు ఆలస్యంగా కాకుండా పూర్తిచేయడానికి క్లరికల్ సిబ్బంది సహకారం అవసరం. జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఉన్నతాధికారులు సమస్యకు పరిష్కారం చూపి కిట్లు పంపిణీ సజావుగా జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బిలాల్ కాలనీలో కార్డన్ సెర్చ్


వాహనాలు తనిఖీ చేస్తున్న ద్వారకా పోలీస్ స్టేషన్ పోలీసులు

సీతమ్మధార, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ద్వారకా పోలీసు స్టేషన్ పరిధి సీతమ్మధార బిలాల్ కాలనీలో పోలీసులు గురువారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ రమణ, ఎస్ఐలు, సిబ్బంది కాలనీలోని 110 వాహనాలను, అనుమానితులను తనిఖీ చేశారు. ఆరు ద్విచక్ర వాహనాలకు రికార్డులు లేనట్లు గుర్తించి వాటిని స్టేషన్‌కు తరలించారు. అనుమానితుల ఇళ్లను కూడా సోదా చేశారు.

ఒకటో తరగతిలో ప్రవేశానికి విభిన్న ప్రతిభావంతులకు ఆహ్వానం

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అనాథ పిల్లలు, విభిన్న ప్రతిభావంతులకు విద్యా హక్కు చట్టం ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని రాష్ట్ర సమగ్ర శిక్ష అదనపు సమన్వయకర్త జె.చంద్రశేఖరరావు తెలిపారు. అన్ని కేటగిరీల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఈ నెల 28 నుంచి మే 15 వరకు cse.ap.gov.in వెబ్‌సైట్‌లో, గ్రామ సచివాలయంలో, మండల విద్యాశాఖ కార్యాలయాల్లో ఎక్కడైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థుల ఇళ్లకు దగ్గర్లో ఉన్న ఐబీ, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, స్టేట్ సిలబస్ బోధిస్తున్న ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం కోటా కింద ప్రవేశం పొందవచ్చని చంద్రశేఖరరావు చెప్పారు. మరిన్ని వివరాలకు సమగ్ర శిక్షా పాఠశాల విద్యాశాఖ టోల్ ఫ్రీ 1800 4258 599 ను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

నేడు ఏపీఆర్‌జేసీ పరీక్ష

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష శుక్రవారం జరగనుంది. గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2:30 నుంచి 5 గంటల వరకు జరిగే పరీక్షకు 240 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉందని కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బి.లక్ష్మీనరస తెలిపారు. కేంద్రంలో అన్ని వసతులు కల్పించినట్లు చెప్పారు.

ప్రేక్షకులను ఆకట్టుకునేలా 'సారంగపాణి జాతకం'



సమావేశంలో డైరెక్టర్ ఇంద్రగంటి, హీరోయిన్ రూపా, హీరో ప్రియదర్శి

మహారాణిపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రేక్షకులను ఆకట్టుకునేలా 'సారంగపాణి జాతకం' చిత్రం తెరకెక్కిందని చిత్ర కథానాయకుడు ప్రియదర్శి అన్నారు. ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో ప్రియదర్శి హీరోగా రూపా కొడువాయూర్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా చిత్ర యూనిట్ నగరంలోని హోటల్ దసపల్లాలో నిర్వహించిన సమావేశంలో హీరో ప్రియదర్శి మాట్లాడుతూ ఈ చిత్రంలో తన పాత్ర అందరికి నచ్చుతుందని గతంలో చేసిన మల్లేశం, బలగం, కోర్టు తరహా భావోద్వేగాలతో సాగే సాధారణ వ్యక్తి కథేనన్నారు. ఈ చిత్రం కోసం దర్శకుడు ఇంద్రగంటి చాలా కష్టపడ్డారన్నారు. గత చిత్రాలలో తెలంగాణ యాసతో మాట్లాడానని, ఈ చిత్రంలో ఆంధ్రా యాసలోనే ఉంటుందన్నారు. దర్శకుడు ఇంద్రగంటి మాట్లాడుతూ విశాఖ ఇష్టమైన నగరమని, అష్టాచెమ్మా ఇక్కడే తీశామని, అదే సెంటిమెంట్‌తో ఈ చిత్రం ప్రమోషన్ ప్రారంభిమచామన్నారు. అందరూ ఇష్టపడే హాస్యంతో ఈ చిత్రం ద్వారా వస్తున్నామన్నారు. విశాఖలోనే ప్రీమియర్ షో ప్రదర్శిస్తామన్నారు.

రైల్వేలో ఉచిత ఆరోగ్య పరీక్షలు


రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

విశాఖపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ మెడికల్ విభాగం, విశాఖపట్నం బ్లడ్ డోనర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం, ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిం చారు. రైల్వే ఉద్యోగులలో ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో భాగంగా రైల్ క్లబ్‌లో హెల్పింగ్ హార్ట్స్, రోటరీ బ్లడ్ బ్యాంకు సహకారంతో నిర్వహించిన శిబిరంలో 200 మందికి పైగా ఉద్యోగులు, అధికారులు హాజరై ఉచిత వైద్య పరీక్షలు చేయించుకున్నారు. స్వచ్ఛందంగా సుమారు 50 యూనిట్ల రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి డీఆర్ఎం లలిత్ బొహ్రా ముఖ్య అతిథిగా హాజరై స్థానిక స్వచ్ఛంద సంస్థలతో రైల్వే మెడికల్ విభాగం చేపట్టిన రక్తదాన శిబిరం, ఉచిత వైద్య పరీక్షల కార్యక్రమాలను కొనియాడారు. సీఎంఎస్ శరత్‌బాబు పాల్గొన్నారు.

షిర్డీసాయి ధ్యాన మందిరంలో...

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 42వ వార్డు రైల్వే ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి ధ్యానమందిరంలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఓమ్ని గిగ్గల్స్ ఆసుపత్రి, వాసన్ ఐ కేర్ వారు సుమారు 120 మందికి అధిక రక్తపోటు, మధుమేహం, కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, ఆసుపత్రుల ప్రతినిధులు చంటి, ఉదయ్, గోవింద్, నరేష్, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యమాంబ మారువారం ఉత్సవం

కంచరపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం మెట్టు వద్ద కొలువై ఉన్న ముత్యమాంబ అమ్మవారి మారువారం పండగ గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారి ఆలయంలో వేకువజాము నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పశ్చిమ ఎమ్మెల్యే తనయుడు మౌర్య అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

27న నూకాంబిక అమ్మవారి పండుగ



మురళీనగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): బర్మాక్యాంప్‌లో ఈ నెల 27న నూకాంబిక అమ్మవారి పండుగ నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు బుచ్చిబాబు శర్మ తెలిపారు. ఆ రోజున ఉదయం 4 గంటల నుంచే అమ్మవారికి పంచామృతాభిషేకాలు, నూతన వస్త్రధారణ, విశేష అలంకరణలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈఓ పర్యవేక్షణలో దేవస్థానం వద్ద ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు.

పదో తరగతి ఫలితాల్లో భాష్యం విద్యార్థుల హవా



ప్రతిభావంత విద్యార్థులతో భాష్యం పాఠశాల ఉపాధ్యాయులు

సీతమ్మధార, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ద్వారకానగర్‌లో గల భాష్యం పాఠశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. పరీక్షలకు హాజరైన 131 మంది విద్యార్థులు శతశాతం ఉతీర్ణత సాధించారు. ద్వారకానగర్ బ్రాంచ్ భాష్యం పాఠశాల్లో చదువుతున్న తీగల నవ్య 593 మార్కులు సాధించింది. 35 మంది విద్యార్థులకు 550 పైగా మార్కులు వచ్చాయి. 65 మందికి 500పైగా వచ్చాయి. గణితంలో వందకి వంద మార్కులను ఆరుగురు విద్యార్థులు, 90కి పైగా 58 మంది సాధించారు. సైన్స్‌లో వందకి వంద మార్కులు నలుగురికి, 90కి పైగా మార్కులు 63 మందికి లభించాయి. భాష్యం విద్యా సంస్థల చైర్మన్ రామకృష్ణ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ విజయానికి కారకులైన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి, సహకరించిన తల్లిదండ్రులకు రామకృష్ణ, విశాఖలోని విద్యాసంస్థల పీఈఓ ఎం.సత్యం, జోనల్ ఇంచార్జ్ కె.వెంకట్ అభినందించారు.

కె.కె.రాజుకు వైసీపీ నేతల అభినందన


సీతమ్మధార వైసీపీ కార్యాలయంలో రాజును కలిసిన ఆ పార్టీ నాయకులు

సీతమ్మధార, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులుగా నియమితులైన కె.కె.రాజును 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మరెడ్డి అభినందించారు. జీవీఎంసీ వైసీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్, 42వ వార్డు నాయకులు సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు.

నేడు డీఆర్‌సీ సమావేశం

... 5వ పేజీ తరువాయి

సరఫరాలు, పంచాయతీరాజ్, గృహ నిర్మాణ శాఖలపై చర్చకు ప్రతిపాదించారు. జీవీఎంసీకి సంబంధించి నగరంలో వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు, నీటి సరఫరా, యూజీడీ, పారిశుధ్యం, వీధి దీపాలు, టిడ్కో ఇళ్లు, వీఎంఆర్‌డీ మాస్టర్‌ప్లాన్, కొత్త ప్రాజెక్టులపై చర్చించనున్నారు. రెవెన్యూ శాఖ విషయానికి వస్తే ప్రధానంగా ఆక్రమణల క్రమబద్ధీకరణకు సంబంధించి జీవోలు 30, 45, 27 అమలు, ఇంకా సంక్షేమ పథకాల అమలు, డీఆర్‌డీఏ, ఎన్టీఆర్ భరోసా, డ్వామా, ఉపాధి పథకం, నీటి సరఫరా తదితర అంశాలపై అధికారులు నివేదికలు సిద్ధం చేశారు.

ఉక్కు కార్మికులకు అండగా ఉంటా

... 5వ పేజీ తరువాయి

వివరాలను ఆమెకు పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్ వివరించారు. ప్యాకేజీ వల్ల కర్మాగారానికి, కార్మికులకు ఒరిగేదేమీ లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి, తన తాబేదార్లకు కట్టబెట్టాలని మోదీ చూస్తున్నారని ఆరోపించారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా చేపట్టిన ఉద్యమానికి సంపూర్ణ సహకారం అందించాలని షర్మిలను అభ్యర్థించారు. ఉక్కు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. అందుకు ఆమె స్పందిస్తూ కార్మికులకు అండగా ఉంటానని, మరోమారు వచ్చి దీక్షలలో కూర్చుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ, కేఎస్ఎన్ రావు, వరసాల శ్రీనివాసరావు, దొమ్మేటి అప్పారావు, వెంకటేశ్వరరావు, వి.ప్రసాద్, పలువురు ఉక్కు ఉద్యోగులు పాల్గొన్నారు.

కేజీహెచ్ వైద్యులకు షోకాజ్

... 5వ పేజీ తరువాయి

ఉన్నట్టు గుర్తించారు. వారికీ షోకాజ్ నోటీసులు జారీచేయాలని ఆయన ఆదేశించారు. ఈ మేరకు ఆస్పత్రి అధికారులు ఎమర్జెన్సీ మెడిసన్ విభాగాధిపతి డాక్టర్ వీఎస్ఎస్ మూర్తి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.నరసింగరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.కిరణ్‌కుమార్, క్యాజువాల్టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జేఎస్‌కేవై చక్రవర్తి, అనస్థీషియా టెక్నీషియన్ డాక్టర్ సీహెచ్ అమర్‌బాబు, హెడ్ నర్స్ కె.సుజాతకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. దీనికి సంబంధించి వారి నుంచి వివరణ తీసుకున్న తరువాత చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

సాదాసీదాగా ఏయూ శతాబ్ది వేడుకలు ప్రారంభం?

... 5వ పేజీ తరువాయి

వీసీకి చెప్పినట్టు తెలిసింది. దీంతో అధికారులు ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తిని ముఖ్య అతిథిగా, కేరళలోని పాలక్కాడ్ ఐఐటీ డైరెక్టర్ ఎ.శేషాద్రి శేఖర్‌ను గౌరవ అతిథిగా ఆహ్వానించారు. ఈ నెల 26న బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే శతాబ్ది వేడుకల ప్రారంభోత్సవ కార్యక్రమానికి వీరు హాజరుకానున్నారు. అదేరోజు ఉదయం బీచ్ రోడ్డులో వాక్‌థాన్ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ జెండా ఊపి ప్రారంభిస్తారు. అలాగే, ఏయూలో వందేళ్ల ఉత్సవాలకు సంబంధించిన బెలూన్ ఎగురవేసే కార్యక్రమాన్ని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ చేపడతారు. మిగిలిన కార్యక్రమాలన్నీ పూర్తిగా ఏయూ అధికారులు ఆధ్వర్యంలో జరగనున్నాయి. వేడుకలను సాదాసీదాగా ప్రారంభించడంపై వర్సిటీ వర్గాలు పెదవివిరుస్తున్నాయి. అదే సమయంలో దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో ఒకటైన ఏయూ వందేళ్ల వేడుకల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వమే తీసుకుని ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం అధ్యాపక వర్గాల్లో వ్యక్తమవుతోంది.

ఐటీ భవనాలన్నీ ఖాళీ!

... 5వ పేజీ తరువాయి

ఇచ్చింది. అందులో కూడా ఎటువంటి కార్యకలాపాలు చేపట్టలేదు. ఉపాధి కల్పిస్తామని ఇచ్చిన హామీని పూర్తి చేయకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం విప్రోకు భూమి రిజిస్ట్రేషన్ చేయకుండా ఆపేసింది. ఇప్పటికీ అదే పరిస్థితి కొనసాగుతోంది. అందులో కొన్ని (2, 5, 6) అంతస్థులను ఆరేళ్ల క్రితం 2019లో ఒమిక్స్ ఇంటర్నేషనల్ (పల్సస్) సంస్థకు అద్దెకు ఇవ్వగా వారు దాదాపు వెయ్యి మందికి ఉపాధి కల్పించారు. అయితే అక్కడి నుంచి ఐటీ ఉత్పత్తులను విదేశాలకు రాయితీపై ఎగుమతి చేసుకునే అవకాశం లేకపోవడంతో ఆ సంస్థ కూడా కొద్దికాలానికే ఖాళీ చేసి వెళ్లిపోయింది. ఒమిక్స్ అద్దెకు తీసుకున్న భవనం సెజ్ పరిధిలో లేకపోవడమే దీనికి కారణం. అంతకుముందు విప్రోతో లీజు ఒప్పందానికి ఒమిక్స్ యత్నించింది. ఆ భూమి విప్రో పేరుతో లేదని రిజిస్ట్రేషన్ల శాఖ తిరస్కరించింది. దాంతో ఒమిక్స్ ఆ ప్రాంగణం ఖాళీ చేసింది. తాజాగా ఈ నెల మొదటి వారంలో తమను మోసం చేశారంటూ విప్రోపై ద్వారకానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టింది. విదేశాలకు ఐటీ ఎగుమతులు చేసుకునే అవకాశం లేకపోవడంతో దాదాపు రూ.200 కోట్ల వరకు నష్టపోయామని ఆరోపించింది. ప్రస్తుతం విప్రో చేతిలో ఏడు ఎకరాలు ఉండగా, నామమాత్రపు ఉద్యోగులతోనే నడుస్తోంది.

అవిశ్వాస తీర్మానంలో అందరూ పాల్గొనాలి: వంశీకృష్ణ శ్రీనివాస్


జనసేన నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

సీతంపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని జనసేన కార్యాలయంలో ఆ పార్టీ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కార్పొరేటర్లు గురువారం సమావేశమయ్యారు. ఈ నెల 26న జరగనున్న డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి సంబంధించి పలు అంశాలను ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రస్తావించారు. జనసేన పార్టీ 14 మంది కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. జీవీఎంసీలో ఫ్లోర్ లీడర్ వసంత లక్ష్మి ఆధ్వర్యంలో కార్పొరేటర్లు గోవింద్ రెడ్డి, మూర్తియాదవ్, మేరీ జాన్స్ సాదిక్, కందుల నాగరాజు, ఉషశ్రీ, కామేశ్వరి, సూర్యకుమారి, వంశీరెడ్డి, బెహరా భాస్కరరావు, ఆళ్ల లీలావతి, ఎలమంచిలి ఎమ్మెల్యే విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి బహుభాషా నృత్య శిక్షణ శిబిరం

వెంకోజీపాలెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి బహుభాషా నృత్య విభాగంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు డైరెక్టర్ ఆర్.జానకి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎంటీసీ కాలనీ ఏపీఎస్ఈబీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో ప్రతి ఆదివారం మధ్నాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు పది నుంచి పదహారేళ్ల లోపు బాలబాలికలకు బహుభాషా నృత్యాల్లో శిక్షణ ఇస్తామన్నారు. జూన్ 10 వరకు ప్రతి జరిగే ఈ తరగతుల్లో నృత్యాంశాలు నేర్పిస్తామన్నారు. నృత్య అనుభవం ఉండి త్వరగా నేర్చుకున్న బాల కళాకారులకు వెంటనే ప్రదర్శన అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తిగల జిల్లాకు చెందిన బాలలు ఈ నెల 27 లోపు ఫోన్ నెం.8522990123లో సంప్రదించి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. జూన్ 10న శిబిరం ముగుస్తుందన్నారు.

సత్యసాయి ఆరాధనోత్సవం

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయిబాబా 14వ ఆరాధన మహోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. సత్యసాయి సేవాసంస్థలు, విశాఖ జిల్లా సత్యసాయి సేవా సమితి, సిటీ సమితి సంయుక్తంగా ఎంవీపీ కాలనీలోని ప్రేమసదన్ మందిరంలో గురువారం తెల్లవారుజాము నుంచే కార్యక్రమాలు చేపట్టారు. ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, రుద్రాభిషేకం, శ్రీసత్యసాయి సహస్రనామ పుష్పార్చన, విశ్వమానవ కల్యాణం, శ్రీసత్యసాయి గాయత్రీ విశ్వశాంతి హోమం అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. మధ్యాహ్నం నారాయణ సేవ జరిగింది. సాయంత్రం వేదపఠనం, సిటీ సమితి గాయనీగాయకుల నామ సంకీర్తన, సత్యసాయి విద్యా విహార్ మేథమెటిక్స్ విభాగాధిపతి బగ్గం సురేష్ ఆధ్యాత్మిక ప్రసంగం, మంగళహారతితో ఉత్సవాలు ముగించారు.విద్యావిహార్ పదో తరగతి విద్యార్థులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.నిరాశ్రయులకు మజ్జిగ, అరటిపండ్లు, బిస్కెట్లు వంటివి అందించారు. అనాథాశ్రమానికి బియ్యం, కూరగాయలు, నూనె తదితర నిత్యావసరాలు అందజేశారు. జిల్లా అధ్యక్షుడు నాయుడు, కన్వీనర్ సీతారామరాజు తదితరులు పర్యవేక్షించారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

వెంకోజీపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సహచర క్రీడాకారుడు, గురువు పల్లా పైడిరాజు జ్ఞాపకార్థం 16వ వార్డు హెచ్‌బీ కాలనీ అబ్దుల్ కలాం పార్కులోని కోర్టు -2లో పైడిరాజు మెమోరియల్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. 15 జట్లు పాల్గొన్నాయి. ఉదయం, సాయంత్రం ఈ పోటీల్లో పాల్గొన్న జట్లకు లీగ్ మ్యాచ్‌లు నిర్వహించారు. శుక్రవారం ఉదయం సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించి, విజేతలకు జ్ఞాపికలు బహూకరిస్తామని నిర్వాహకులు తెలిపారు. తమ గురువైన పైడిరాజు గత ఏడాది అకాల మరణం పొందారని, ఆయన నేర్పిన విద్యతో తాము ప్రతి రోజు షటిల్ ఆడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పల్లా శ్రీను, పల్లా శివ, ప్రసాద్, ఒమ్మి కోటి, ఒమ్మి జగ్గారావు, వంశీ, చిన్న, పల్లా ప్రసన్న, మహేష్, మణి, జనసేన నాయకులు పీల వెంకట పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **సారంగపాణి జాతకం :** శారద, శ్రీరామ, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)
- **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 10, వంకాయలు (తెలుపు) 15, వంకాయలు (నలుపు) 15, బెండకాయలు 20, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 30, బీరకాయలు 32, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 24, క్యాబేజి 14, క్యారెట్ 32 దొండకాయలు 16, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది)48, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 52, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100,కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, కీరదోస 22, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 36, కంద 80, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 28, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్క కూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

గోవింద నామాలతో టీటీడీ కూడలి ముస్తాబు

- రూ.1.44 కోట్ల స్మార్ట్ సిటీ నిధులు మంజూరు
- 80 శాతం పనులు పూర్తి


టీటీడీ కూడలి వద్ద ఏర్పాటు చేసిన గోవింద నామాలు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని పలు కూడళ్లలో స్మార్ట్ సిటీ నిధులతో ఆకర్షణీయమైన సర్కిళ్లు నిర్మిస్తున్నారు. ముఖ్యంగా కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద ఉన్న సర్కిల్‌ను అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ పనులు దాదాపు పూర్తికావొచ్చాయి.ఇక్కడ టీటీడీ కూడలిగా పేరొందడంతో ఆపేరుకు తగ్గట్లే సర్కిల్‌ను ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దారు. నాలుగు రోడ్ల కూడలి కావడంతో మధ్యలో గోవింద నామాలతో తీర్చిదిద్దాలని నిర్ణయించారు. దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయి. గోవింద నామాలను ఇప్పటికే అమర్చేశారు. వాటర్ ఫౌంటెన్‌లు, విద్యుత్తు దీపాలు, పచ్చదనం వంటివి ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ కూడలి నిర్మాణానికి రూ.1.44 కోట్లు మంజూరయ్యాయి. సర్కిల్ చుట్టూ రోడ్డును తవ్వి, అందంగా కనిపించడానికి స్టోన్ రోడ్డు నిర్మించారు. ఇసుకతోట, బీచ్ రోడ్డుల నుంచి వచ్చేటప్పుడు రెండు వైపులా కనిపించేలా శంఖు, చక్ర, నామాలను అమర్చారు. ఫౌంటెన్‌లు, విద్యుత్తు దీపాలు అమర్చాల్సి ఉంది. టీటీడీ కల్యాణమండపంలో నిత్యం ఏదో ఒక కార్యక్రమం జరుగుతుంది. అక్కడ కల్యాణ బాజాలు సాధారణం కాగా,పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ శంఖు, చక్ర, నామాలతో కూడలిని తీర్చిదిద్దడం పట్ల ఈ ప్రాంతీయుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

అర్జీలు 45 రోజుల్లోగా పరిష్కరించాలి

వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

సిరిపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజా దర్బార్‌కు వచ్చిన అర్జీలను 45 రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం వీఎంఆర్డీఏ కార్యాలయంలో ఇప్పటి వరకు వచ్చిన మొత్తం వినతులపై అన్ని విభాగాధిపతులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత ప్రజా సమస్యల పరిష్కారమన్నారు. ఇప్పటి వరకు వచ్చిన వినతులకు ఎట్టి పరిస్థితుల్లో పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాదర్బార్‌లో ఇచ్చిన అర్జీలకు 45 రోజుల్లో పూర్తిస్థాయిలో సమాధానం ఇవ్వాలని చెప్పారు. ప్రధానంగా భూ సంబంధిత వినతుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, డీఎఫ్ఓ సుజాతాశివానీ, ఎస్టేట్ అధికారి దయానిధి, ఎల్ఏఓ వేణుగోపాల్, పరిపాలనాధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



వినతులపై అధికారులతో సమీక్షిస్తున్న చైర్మన్ ప్రణవ్ గోపాల్

‘ఉగ్రవాదాన్ని అందరూ వ్యతిరేకించాలి’

విశాఖపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కుల, మతాలకు అతీతంగా ఉగ్రవాదాన్ని ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని, మతాలు వారీగా విడిపోయి కొట్లాడుకునే సమయం ఇది కాదని పలువురు పేర్కొన్నారు. కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ ఏయూ ప్రధాన గేటు వద్ద ఆంధ్ర యూనివర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులు శాంతియుత నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారంతా ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, విద్యార్థులు మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడి ఘటన నేపథ్యంలో దేశమంతా ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు.ఇప్పుడు కశ్మీర్‌లో జరిగిన ఘటన రేపు ఎక్కడైనా జరుగుతుందని, కాబట్టి దేశ ప్రజలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఏయూలో ఫైనాన్స్ ఆఫీసర్ సూర్యారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ సాంబమూర్తి, పైడి శ్రీనివాస్, అమరేందర్, సాయి బలరామ్, బొట్టా రామచందర్ తదితరులు పాల్గొన్నారు.


శాంతియుత నిరసన ర్యాలీలో పాల్గొన్న ఏయూ ఉద్యోగులు, విద్యార్థులు

‘భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి’

సిరిపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ గురువారం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ మాట్లాడుతూ సుమారు 30 లక్షల మంది భవన నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డు ద్వారా అనేక సంవత్సరాలుగా అమలవుతున్న సంక్షేమ పథకాలను ఆపేస్తూ గత వైసీపీ ప్రభుత్వం 1214 మెమో జారీ చేసిందన్నారు. ఫలితంగా లక్షలాది మంది కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. ఎన్నికలకు ముందు టీడీపీ హామీ ఇచ్చినట్టుగా రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి, సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెంకట్రావు, అధ్యక్షులు అనసూయ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, రాము నాయుడు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్ రోడ్డులో పుష్ప సోయగాలు


బీఆర్‌టీఎస్ రోడ్డులో ఓ చెట్టు నిండా పూలు

ఆరిలోవ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ముడసర్లోవ పార్కు సమీపంలో చెట్లు ఎత్తుగా, గుబురుగా పెరిగాయి. ఆ చెట్లకు పూసిన స్వర్ణ రంగు పుష్పాలు బాటసారులు, పార్కు సందర్శకులను ఎంతగానో అలరిస్తున్నాయి. ఈ మార్గంలో ప్రయాణించేవారికి నయనానందకరంగా కనిపిస్తూ వాహనచోదకుల మనసు దోచుకుంటున్నాయి. శ్రీకృష్ణాపురం ఎలిమెంటరీ స్కూలు సమీపంలో ఊదా రంగు పూల సోయగం మనోరంజకంగా కనిపిస్తోంది. బీఆర్‌టీఎస్ రోడ్డు చినగదిలి వద్ద లేత గులాబీ రంగులో వికసిస్తూ, పరిమళాలు వెదజల్లుతున్నాయి. ఈ చెట్లను సుమారు ఏడేళ్ల క్రితం ప్రభుత్వం రోడ్లకు ఇరువైపులా నాటించింది. మండు వేసవిలో బీఆర్‌టీఎస్ రోడ్డులో సాయంత్రం ప్రయాణం ఎంతో ఆనందాన్నిస్తుందని పలువురు వాహన చోదకులు అంటున్నారు.




ఓ కంపెనీ ప్రతినిధికి జ్ఞాపిక అందజేస్తున్న ఎంపీ శ్రీభరత్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పక్కన మెగా జాబ్ మేళాకు హాజరైన యువతీ యువకులు

యువత చేతిలోనే దేశ భవిష్యత్తు : ఎంపీ శ్రీభరత్

- ఉపాధి అవకాశాల మెరుగుకు ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యం గల యువతే దేశాభివృద్ధికి పునాదులని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ యువత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు నిర్వహించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేం దుకు కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాలకు విశేష స్పందన వస్తుందని పేర్కొన్నారు. అనంతరం మేళాలో పాల్గొన్న సుమారు 60 కంపెనీల ప్రతినిధులకు ఎంపీ, కలెక్టర్ జ్ఞాపికలను అందజేశారు.ఈ జాబ్ మేళాలో సుమారు మూడు వేల మంది అభ్యర్థులు పాల్గొనగా వెయ్యి మందికి కొలువులు లభించాయి. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఏపీసీవోఎస్‌జీఎఫ్ఎల్ చైర్మన్ గండి గండి బాబ్జీ, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉర్సాకు భూ కేటాయింపులు రద్దు చేయాలి

విశాఖపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : డేటా సెంటర్ ముసుగులో ప్రభుత్వం ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే డొల్ల సంస్థకు భూ కేటాయింపులను సీపీఎం వ్యతిరేకిస్తోందని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పేర్కొన్నారు. సంస్థకు ఏకంగా 60 ఎకరాల విలువైన భూమిని కేటాయించడం రాజకీయ అవినీతేనన్నారు. అక్రమ కేటాయింపులను తక్షణమే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారాం, భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తితో కలిసి గురువారం కాపులుప్పాడ ఐటీహిల్ -3లో ఉర్సాకు కేటాయించిన భూములను పరిశీలించింది. దీనివిలువ సుమారు రూ.3 వేల కోట్లు ఉంటుందని, రూ.5,278 కోట్ల పెట్టుబడితో డేటా సెంటర్ నెలకొల్పుతామని, 2,500 మందికి ఉద్యోగాలు వస్తాయని చేసిన ప్రకటన నమ్మశక్యంగా లేదనిన్నారు. అమెరికాలో గతేడాది సెప్టెంబరు 27న, ఈ ఏడాది ఫిబ్రవరి 12న సంస్థను రిజిస్టర్ చేశారని, అధీకృత పెట్టుబడిగా రూ.10 లక్షలు మాత్రమే చూపిందనిన్నారు. ప్రభుత్వంలోని కొందరికి ఇది బినామీ సంస్థని ఆరోపించారు. ఈ సంస్థ వెనుక విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఉన్నారని, అతని బినామీ అబ్బూరి సతీష్ డైరెక్టర్ అని పేర్కొన్నారు.

కార్పొరేటరు ఇంటిపై దాడి.. కేసు నమోదు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పదిహేడో వార్డు కార్పొరేటరు గేదెల లావణ్య ఇంటిపై దాడికి యత్నించిన ఘటనలో ఆమె భర్త ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం రాత్రి పెదవాల్తేరుదలైవారి వీధిలో ఉంటున్న కార్పొరేటరు లావణ్య, ఆమె భర్త నాగరాజు ఇంట్లో లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దాడికి యత్నించారు. పూలకుండీలను ధ్వంసం చేసి వెళ్లిపోయారు. నాగరాజు తల్లిదండ్రులను అసభ్యంగా తిట్టారు. కొద్ది రోజుల క్రితం తనను బెదిరించిన వారిపై అనుమానం ఉన్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఎస్‌ఐ ధనుంజయ నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫొటోగ్రాఫర్‌పై దాడి

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఓ దినపత్రిక ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ ఆదిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఫొటోగ్రాఫర్ రాజేష్ ద్విచక్రవాహనంపై కుమారుడిని పాఠశాల నుంచి తీసుకుని వస్తుండగా, డీఆర్‌డీఏ సమీపంలోకి వచ్చేసరికి ఏపీ39బిడి 3610 నెంబరు గల ఆటో ఢీకొట్టింది. ఆటో డ్రైవర్‌ను ప్రశ్నించగా, మద్యం తాగి ఉన్న ఇద్దరు వచ్చి, రాజేష్‌పై దాడి చేశారు. సమీపంలో ఉన్న సాయికృష్ణ అడ్డుకోవడానికి ప్రయత్నించగా, అతడిపై దాడి చేశారు. రాజేష్ ఫిర్యాదు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెమిస్టర్ పరీక్షలకు అనుమతి ఇవ్వాలని ఆందోళన

విశాఖపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఏయూలోని ఇంజనీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్, సివిల్ ఇంజనీరింగ్ మొదటి ఏడాది రెండో సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు కొందరు వీసీ కార్యాలయం ఎదుట గురువారం సాయంత్రం ఆందోళన నిర్వహించారు. ఈ రెండు విభాగాలకు చెందిన 30 మంది విద్యార్థులకు హాజరు తక్కువగా ఉందని పరీక్షలకు అనుమతించలేదు. దీంతో వారు తమను పరీక్షలకు అనుమ తించాలని ఆందోళన చేశారు. 60 శాతం కంటే తక్కువ ఉన్న వారిని పరీక్షలకు ఆపినట్టు చెబుతున్నారని, కానీ, 40 శాతం కంటే తక్కువ హాజరు ఉన్న విద్యార్థులు కూడా పరీక్షలకు హాజరైనట్టు వారు తెలిపారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన వెంకటరమణ, అభిషేక్, సంజు, వికాస్ పాల్గొన్నారు.

పోలమాంబ హుండీల ఆదాయం రూ.2.93 లక్షలు

పెదవాల్తేరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థానంలో గురువారం హుండీల కానుకలు లెక్కించారు.ఏడు రోజులకు రూ.2,93,258 నగదు, 14 గ్రాముల బంగారం,280 గ్రాముల వెండి వచ్చినట్లు దేవస్థానం ఈవో కె.గాయిత్రి తెలిపారు. దేవదాయ శాఖ పర్యవేక్షణ అధికారిగా అల్లు జగన్నాథం, పెదవాల్తేరు గ్రామ సంఘం, ఉత్సవ కమిటీ సభ్యులు, త్రీ టౌన్ పోలీసులు, శ్రీహరిసేవ సభ్యులు, రెవెన్యూ, ఆలయ సిబ్బంది ఇందులో పాల్గొన్నారు.

ఏయూలో నృత్య దినోత్సవ వర్క్‌షాప్


వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నృత్య దినోత్సవం సందర్భంగా రెండు రోజుల వర్క్ షాప్ ఏయూలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ఏయూ శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇలాంటి వర్క్‌షాప్‌లు నిర్వహించడం మంచి విషయమన్నారు. ఏయూ, ఇతర కళాశాలల నుంచి సుమారు వంద మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వర్క్‌షాప్ కన్వీనర్ ఆచార్య ఎ.అనురాధ, విభాగపు ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర కారాగారం డెయిరీ ఫారంలో 26న వేలం

ఆరిలోవ. ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కారాగారం డెయిరీ ఫారంలోని పరేడ్ మైదానంలో 14 పశువులకు ఈ నెల 26న ఉదయం 10 గంటలకు వేలం జరుగుతుందని సూపరింటెండెంట్ మహేష్‌బాబు తెలిపారు. ఔత్సాహికులు రూ.1,500 ధరావతు చెల్లించాలన్నారు. ఆవు 1, ఆడదూడలు 5, గేదె 1, దున్నదూడలు 7 వేలం వేస్తామన్నారు. కారాగారం ఆవరణలో మామిడి పంటను కూడా ఆదే రోజు వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం రూ.వెయ్యి ధరావతు చెల్లించాలన్నారు. పాట పాడిన వారు వెంటనే సొమ్ము చెల్లించవలసి ఉంటుందన్నారు.

వైసీపీ నూతన జిల్లా అధ్యక్షులకు సన్మానం


గుడివాడ అమర్‌నాథ్, కేకే రాజును పూలమాలతో సన్మానిస్తున్న కార్పొరేటర్లు

మద్దిలపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి, విశాఖ జిల్లాల వైసీపీ అధ్యక్షులుగా నియమితులైన గుడివాడ అమర్‌నాథ్, కెకె రాజులను మద్దిలపాలెంలోని వైసీపీ కార్యాలయంలో గురువారం ఆ పార్టీ కార్పొరేటర్లు గజమాలతో సన్మానించారు. పార్టీ బలోపేతానికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని నేతలు అన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంఎస్‌కె ప్రసాద్ జన్మదిన వేడుకలు


దివ్యాంగుల నడుమ కేక్ కట్ చేస్తున్న ఫిజికల్ డైరెక్టర్ ఎం.విజయ మోహన్

పెదవాల్తేరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): హిడెన్ స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో భారత క్రికెట్ జట్టు మాజీ సెలెక్టర్ ఎంఎస్‌కె ప్రసాద్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంఎస్‌కె స్నేహితులు కిషోర్, శ్రీధర్‌ల సమక్షంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏయూ ఫిజికల్ డైరెక్టర్ విజయమోహన్ పాల్గొని దివ్యాంగులతో కలిసి కేకు కోశారు. అనంతరం దివ్యాంగులకు భోజనాలు ఏర్పాటు చేశారు. మానసిక దివ్యాంగ పిల్లలంతా ఎంఎస్‌కె ప్రసాద్‌కు వీడియో కాల్‌లో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల నిర్వాహకుడు కండిపిల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ జన్మదిన వేడుకలు ప్రతి సంవత్సరం మానసిక దివ్యాంగుల నడుమ జరుపుకోవటం ఆయనకు ఎంతో ఆనందాన్ని కలుగజేస్తుందన్నారు. ఇలాంటి పిల్లలకు ఉచితంగా సేవలు చేస్తున్న నిర్వాహకుడు కండిపిల్లి శ్రీనివాసరావు, అతని సిబ్బందికి ఎంఎస్‌కే ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

'భారత్ అభివృద్ధిని ఓర్వలేని పాకిస్థాన్ ఉగ్ర పన్నాగమిది'


డాబాగార్డెన్స్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద చంద్రమౌళి చిత్రపటం పట్టుకుని మైనాయించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, జనసేన నాయకులు



కంచరపాలెం మెట్టు వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న పశ్చిమ జనసేన ఇన్‌చార్జి అంక ప్రశాంతి, జనసైనికులు


అక్కయ్యపాలెం ఎనబై అడుగుల రోడ్డులో మోకాళ్లపై నిరసన వ్యక్తంచేస్తున్న పసుపులేటి కల్పన, జనసైనికులు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన దాడిలో మరణించిన నగర వాసి చంద్రమౌళికి విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ సంతాపం తెలిపారు. గురువారం సాయంత్రం డాబాగార్డెన్స్ ఎల్ఐసీ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర చంద్రమౌళి చిత్రపటాన్ని పట్టుకుని నల్లరిబ్బన్లు ధరించి కూటమి నాయకులతో కలిసి మౌనప్రదర్శన చేశారు. భారతదేశ అభివృద్ధిని చూసి ఓర్వలేక పాకిస్థాన్ ఇటువంటి పిరికిపంద చర్యలకు ఒడిగట్టిందని వంశీకృష్ణ దుయ్యబట్టారు. ప్రతి భారతీయుడు ఈ చర్యను ఖండిస్తూ, మృతులకు సంతాపం తెలపాలని కోరారు. ఉగ్ర దాడిని ఖండిస్తూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు మూడు రోజులు సంతాప దినాలు పాటించాలని నిర్ణయించామని ఎమ్మెల్యే అన్నారు. ఉగ్రవాదులను శిక్షించాలంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు.

చంద్రమౌళి సేవలు గొప్పవి

ఉగ్రదాడిలో మరణించిన విశాఖ వాసి చంద్రమౌళికి వైజాగ్ చిల్డ్రన్ క్లబ్, ఆసరా ఛారిటబుల్ సొసైటీ సభ్యులు నివాళులర్పించారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో వీసీసీ, ఆసరా సంయుక్త ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. వీసీసీ వ్యవస్థాపకురాలు కె.రమాప్రభ మాట్లాడుతూ చంద్రమౌళి స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్నప్పటి నుంచి ఆసరా ఛారిటబుల్ సొసైటీ సభ్యులుగా పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవారని చెప్పారు. ఈసీ సంజీవ్‌కుమార్, సుధ, శోభ, సుశీల పాల్గొన్నారు.

మెట్టువద్ద కొవ్వొత్తులతో నిరసన

కంచరపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉగ్రమూకలు విచక్షణ రహితంగా కాల్పులు జరిపి పర్యాటకులను పొట్టనబెట్టుకున్న దారుణ ఘటనను ఖండిస్తూ పశ్చిమ నియోజకవర్గం జనసైనికులు గురువారం రాత్రి కంచరపాలెంలోని మెట్టు వద్ద కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన నగరవాసి చంద్రమౌళి మృతికి మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థన చేశారు. పశ్చిమ నియోజక వర్గం జనసేన నాయకురాలు అంక ప్రశాంతి మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అప్రమత్తం కావాలని కేంద్రానికి సూచించారు. 56వ వార్డు జనసేన నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెంటకోట శివ, బీశెట్టి వెంకటరావు, మల్ల బలరాం తదితరులు పాల్గొన్నారు.

పాకిస్థాన్‌ది పిరికిపంద చర్య

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అమాయక ప్రజలను ఉగ్రవాదులు కాల్చి చంపడం పిరికిపంద చర్యగా జనసేన పార్టీ ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషాకిరణ్ మండిపడ్డారు. అక్కయ్యపాలెం ఎనబై అడుగుల రోడ్డు జంక్షన్‌లో జనసేన నాయకులు నోటికి నల్ల రిబ్బన్ కట్టుకుని మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, 26, 42, 43, 44 వార్డుల జనసేన అధ్యక్షులు బండి కనకరాజు, నాగమణి, గారపాటి లక్ష్మి, పడాల పరమేశ్వర రావు, బొడసింగి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అబిద్‌నగర్ నివాసితుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో


చంద్రమౌళి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన చంద్రమౌళికి అబిద్‌నగర్ నివాసితుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్‌బే పార్కులో సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలువేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు ఎస్‌వీవీ రాజు మాట్లాడుతూ సమాజం మంచి సేవకుడిని కోల్పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో సోమశేఖర్, శ్యాంప్రసాద్, వాకర్లు పాల్గొన్నారు.

రైళ్లలో డీసీఎం ఆకస్మిక తనిఖీలు


ప్యాంటీకార్‌లో తనిఖీ చేస్తున్న సీనియర్ డీసీఎం సందీప్

విశాఖపట్నం, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): రైల్లో ప్రయాణికులకు అందుతున్న సదుపాయాలపై వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ గురువారం రాత్రి తనిఖీలు చేపట్టారు. రైల్లో ప్రయాణించి ఆన్‌బోర్డు హౌస్ కీపింగ్ సిబ్బంది సేవలను పరిశీలించారు. తాగునీరు, కోచ్‌లు, మరుగుదొడ్లలో శుభ్రతను గమనించారు. ప్యాంటీకార్‌లోకి వెళ్లి ఆహార పదార్థాల నాణ్యత, పరిమాణాన్ని తనిఖీ చేశారు. అనంతరం ప్రయాణికులతో మాట్లాడి పరిశుభ్రత పాటించాల్సిన అవసరాన్ని తెలియజెప్పారు. ప్రయాణ సమయంలో వస్తువుల జాగ్రత్త, అనుమానితులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిని, నిషేధ వస్తువులను గుర్తిస్తే వెంటనే హెల్ప్ లైను నంబరు 139కు ఫోన్ చేసి సమాచారమివ్వాలన్నారు. ఆరు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న 163 మందిని డీసీఎం పట్టుకుని వారి నుంచి జరిమానా రూపంలో రూ.లక్ష వసూలు చేశారు.

వనరుల కేంద్రంలో సిబ్బంది లేక అవస్థలు

- సీఆర్పీలపై అదనపు భారం
- అర్బన్ మండలాల్లో పరిస్థితి మరీ దారుణం
- ఒకే మండలంలో ముగ్గురు సిబ్బంది
- మూడు మండలాల్లో ఒకరూ లేరు.
- డేటా పంపడంలో తీవ్ర జాప్యం
- ఉన్నవారిని సర్దుబాటు చేయాలని విజ్ఞప్తి



అక్కయ్యపాలెంలో గల సీతమ్మధార మండల వనరుల కేంద్రం

కంచరపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఏడాది క్రితం నూతనంగా ఏర్పడిన విశాఖపట్టణం అర్బన్ మండలాలు గోపాలపట్టణం, మహారాణిపేట, ములగాడ, సీతమ్మధారలలో క్లరికల్ సిబ్బంది లేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మండల వనరుల కేంద్రం నుంచి అవసరమైన డేటాను విద్యాశాఖకు పంపడంలో సిబ్బంది లేక ఉన్న సీఆర్పీలమీదే భారం పడుతోంది. గతంలో విశాఖ అర్బన్ అంతా ఒకే మండలంగా ఉండేది. ప్రస్తుతం అర్బన్ నాలుగు మండలాలు సీతమ్మధార, గోపాలపట్టణం, మహారాణిపేట, ములగాడగా విడిపోయింది. అయితే అర్బన్ అంతా ఒకే మండలంగా ఉన్నప్పుడు క్లరికల్ సిబ్బంది ఎంఐఎస్ కో-ఆర్డినేటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, అక్కౌంటెంట్‌లు పనిచేశారు. ప్రస్తుతం వీరు సీతమ్మధార మండలంలో ఉండి ఆ ఒక్క మండలానికే పరిమితమయ్యారు. మిగిలిన మండలాల్లో ఒక్కరినీ నియమించలేదు. దీంతో ఆయా కేంద్రాల్లో విధులు చేపడుతున్న సీఆర్పీలే పాఠశాలలను సందర్శించడం, డేటాను సేకరించడం చేస్తున్నారు. సేకరించిన డేటాను సీఆర్పీలే అప్‌లోడ్ చేయాల్సి రావడంతో పనిభారం అధికమవుతుంది. కొత్త మండలాలనైతే ఏర్పాటు చేశారు గాని, కనీసం సిబ్బందిని నియమించడంలో గత ప్రభుత్వం దృష్టి సారించలేదు. ఫలితంగా ఉన్న సీఆర్పీలపైనే అదనపు భారం పడుతుంది. అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి ఒకే మండలానికి పరిమితమై ఉన్న ముగ్గురు క్లరికల్ సిబ్బందిని సర్దుబాటు చేయాలని కోరుతున్నారు. ఈ అకాడమిక్ విద్యాసంవత్సరానికి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి కిట్లు ఆయా మండలాలకు చేరుతున్నాయి. వీటిని పాఠశాలలకు పంపిణీ చేయడం, బిల్లులు సిద్ధం చేయడం తదితర పనులు ఆలస్యంగా కాకుండా పూర్తిచేయడానికి క్లరికల్ సిబ్బంది సహకారం అవసరం. జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఉన్నతాధికారులు సమస్యకు పరిష్కారం చూపి కిట్లు పంపిణీ సజావుగా జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బిలాల్ కాలనీలో కార్డన్ సెర్చ్


వాహనాలు తనిఖీ చేస్తున్న ద్వారకా పోలీస్ స్టేషన్ పోలీసులు

సీతమ్మధార, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ద్వారకా పోలీసు స్టేషన్ పరిధి సీతమ్మధార బిలాల్ కాలనీలో పోలీసులు గురువారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ రమణ, ఎస్ఐలు, సిబ్బంది కాలనీలోని 110 వాహనాలను, అనుమానితులను తనిఖీ చేశారు. ఆరు ద్విచక్ర వాహనాలకు రికార్డులు లేనట్లు గుర్తించి వాటిని స్టేషన్‌కు తరలించారు. అనుమానితుల ఇళ్లను కూడా సోదా చేశారు.

ఒకటో తరగతిలో ప్రవేశానికి విభిన్న ప్రతిభావంతులకు ఆహ్వానం

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అనాథ పిల్లలు, విభిన్న ప్రతిభావంతులకు విద్యా హక్కు చట్టం ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని రాష్ట్ర సమగ్ర శిక్ష అదనపు సమన్వయకర్త జె.చంద్రశేఖరరావు తెలిపారు. అన్ని కేటగిరీల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఈ నెల 28 నుంచి మే 15 వరకు cse.ap.gov.in వెబ్‌సైట్‌లో, గ్రామ సచివాలయంలో, మండల విద్యాశాఖ కార్యాలయాల్లో ఎక్కడైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థుల ఇళ్లకు దగ్గరల్లో ఉన్న ఐబీ, సీబీఎస్సీ, ఐసీఎస్సీ, స్టేట్ సిలబస్ బోధిస్తున్న ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం కోటా కింద ప్రవేశం పొందవచ్చని చంద్రశేఖరరావు చెప్పారు. మరిన్ని వివరాలకు సమగ్ర శిక్షా పాఠశాల విద్యాశాఖ టోల్ ఫ్రీ 1800 4258 599 ను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

నేడు ఏపీఆర్‌జేసీ పరీక్ష

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష శుక్రవారం జరగనుంది. గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2:30 నుంచి 5 గంటల వరకు జరిగే పరీక్షకు 240 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉందని కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బి.లక్ష్మీనరస తెలిపారు. కేంద్రంలో అన్ని వసతులు కల్పించినట్లు చెప్పారు.

ప్రేక్షకులను ఆకట్టుకునేలా 'సారంగపాణి జాతకం'



సమావేశంలో డైరెక్టర్ ఇంద్రగంటి, హీరోయిన్ రూపా, హీరో ప్రియదర్శి

మహారాణిపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రేక్షకులను ఆకట్టుకునేలా 'సారంగపాణి జాతకం' చిత్రం తెరకెక్కిందని చిత్ర కథానాయకుడు ప్రియదర్శి అన్నారు. ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో ప్రియదర్శి హీరోగా రూపా కొడువాయూర్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా చిత్ర యూనిట్ నగరంలోని హోటల్ దసపల్లాలో నిర్వహించిన సమావేశంలో హీరో ప్రియదర్శి మాట్లాడుతూ ఈ చిత్రంలో తన పాత్ర అందరికి నచ్చుతుందని గతంలో చేసిన మల్లేశం, బలగం, కోర్టు తరహా భావోద్వేగాలతో సాగే సాధారణ వ్యక్తి కథేనన్నారు. ఈ చిత్రం కోసం దర్శకుడు ఇంద్రగంటి చాలా కష్టపడ్డారన్నారు. గత చిత్రాలలో తెలంగాణ యాసతో మాట్లాడానని, ఈ చిత్రంలో ఆంధ్రా యాసలోనే ఉంటుందన్నారు. దర్శకుడు ఇంద్రగంటి మాట్లాడుతూ విశాఖ ఇష్టమైన నగరమని, అష్టాచెమ్మా ఇక్కడే తీశామని, అదే సెంటిమెంట్‌తో ఈ చిత్రం ప్రమోషన్ ప్రారంభిమచామన్నారు. అందరూ ఇష్టపడే హాస్యంతో ఈ చిత్రం ద్వారా వస్తున్నామన్నారు. విశాఖలోనే ప్రీమియర్ షో ప్రదర్శిస్తామన్నారు.

రైల్వేలో ఉచిత ఆరోగ్య పరీక్షలు


రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

విశాఖపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ మెడికల్ విభాగం, విశాఖపట్నం బ్లడ్ డోనర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం, ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిం చారు. రైల్వే ఉద్యోగులలో ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో భాగంగా రైల్ క్లబ్‌లో హెల్పింగ్ హార్ట్స్, రోటరీ బ్లడ్ బ్యాంకు సహకారంతో నిర్వహించిన శిబిరంలో 200 మందికి పైగా ఉద్యోగులు, అధికారులు హాజరై ఉచిత వైద్య పరీక్షలు చేయించుకున్నారు. స్వచ్ఛందంగా సుమారు 50 యూనిట్ల రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి డీఆర్ఎం లలిత్ బొహ్రా ముఖ్య అతిథిగా హాజరై స్థానిక స్వచ్ఛంద సంస్థలతో రైల్వే మెడికల్ విభాగం చేపట్టిన రక్తదాన శిబిరం, ఉచిత వైద్య పరీక్షల కార్యక్రమాలను కొనియాడారు. సీఎంఎస్ శరత్‌బాబు పాల్గొన్నారు.

షిర్డీసాయి ధ్యాన మందిరంలో...

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 42వ వార్డు రైల్వే ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి ధ్యానమందిరంలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఓమ్ని గిగ్గల్స్ ఆసుపత్రి, వాసన్ ఐ కేర్ వారు సుమారు 120 మందికి అధిక రక్తపోటు, మధుమేహం, కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, ఆసుపత్రుల ప్రతినిధులు చంటి, ఉదయ్, గోవింద్, నరేష్, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యమాంబ మారువారం ఉత్సవం

కంచరపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం మెట్టు వద్ద కొలువై ఉన్న ముత్యమాంబ అమ్మవారి మారువారం పండగ గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారి ఆలయంలో వేకువజాము నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పశ్చిమ ఎమ్మెల్యే తనయుడు మౌర్య అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

27న నూకాంబిక అమ్మవారి పండుగ



మురళీనగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): బర్మాక్యాంప్‌లో ఈ నెల 27న నూకాంబిక అమ్మవారి పండుగ నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు బుచ్చిబాబు శర్మ తెలిపారు. ఆ రోజున ఉదయం 4 గంటల నుంచే అమ్మవారికి పంచామృతాభిషేకాలు, నూతన వస్త్రధారణ, విశేష అలంకరణలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈఓ పర్యవేక్షణలో దేవస్థానం వద్ద ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు.

కె.కె.రాజుకు వైసీపీ నేతల అభినందన


సీతమ్మధార వైసీపీ కార్యాలయంలో రాజును కలిసిన ఆ పార్టీ నాయకులు

సీతమ్మధార, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులుగా నియమితులైన కె.కె. రాజును 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి అభినందించారు. జీవీఎంసీ వైసీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్, 42వ వార్డు నాయకులు సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు.

నేడు డీఆర్‌సీ సమావేశం

... 5వ పేజీ తరువాయి

సరఫరాలు, పంచాయతీరాజ్, గృహ నిర్మాణ శాఖలపై చర్చకు ప్రతిపాదించారు. జీవీఎంసీకి సంబంధించి నగరంలో వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు, నీటి సరఫరా, యూజీడీ, పారిశుధ్యం, వీధి దీపాలు, టిడ్కో ఇళ్లు, వీఎంఆర్‌డీ మాస్టర్‌ప్లాన్, కొత్త ప్రాజెక్టులపై చర్చించనున్నారు. రెవెన్యూ శాఖ విషయానికి వస్తే ప్రధానంగా ఆక్రమణల క్రమబద్ధీకరణకు సంబంధించి జీవోలు 30, 45, 27 అమలు, ఇంకా సంక్షేమ పథకాల అమలు, డీఆర్‌డీఏ, ఎన్టీఆర్ భరోసా, డ్వామా, ఉపాధి పథకం, నీటి సరఫరా తదితర అంశాలపై అధికారులు నివేదికలు సిద్ధం చేశారు.

ఉక్కు కార్మికులకు అండగా ఉంటా

... 5వ పేజీ తరువాయి

వివరాలను ఆమెకు పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్ వివరించారు. ప్యాకేజీ వల్ల కర్మాగారానికి, కార్మికులకు ఒరిగేదేమీ లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి, తన తాబేదార్లకు కట్టబెట్టాలని మోదీ చూస్తున్నారని ఆరోపించారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా చేపట్టిన ఉద్యమానికి సంపూర్ణ సహకారం అందించాలని షర్మిలను అభ్యర్థించారు. ఉక్కు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. అందుకు ఆమె స్పందిస్తూ కార్మికులకు అండగా ఉంటానని, మరోమారు వచ్చి దీక్షలలో కూర్చుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ, కేఎస్ఎన్ రావు, వరసాల శ్రీనివాసరావు, దొమ్మేటి అప్పారావు, వెంకటేశ్వరరావు, వి.ప్రసాద్, పలువురు ఉక్కు ఉద్యోగులు పాల్గొన్నారు.

కేజీహెచ్ వైద్యులకు షోకాజ్

... 5వ పేజీ తరువాయి

ఉన్నట్టు గుర్తించారు. వారికీ షోకాజ్ నోటీసులు జారీచేయాలని ఆయన ఆదేశించారు. ఈ మేరకు ఆస్పత్రి అధికారులు ఎమర్జెన్సీ మెడిసన్ విభాగాధిపతి డాక్టర్ వీఎస్ఎన్ మూర్తి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.నరసింగరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.కిరణ్‌కుమార్, క్యాజువాల్టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జేఎస్‌కేవై చక్రవర్తి, అనస్థీషియా టెక్నీషియన్ డాక్టర్ సీహెచ్ అమర్‌బాబు, హెడ్ నర్స్ కె.సుజాతకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. దీనికి సంబంధించి వారి నుంచి వివరణ తీసుకున్న తరువాత చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

సాదాసీదాగా ఏయూ శతాబ్ది వేడుకలు ప్రారంభం?

... 5వ పేజీ తరువాయి

వీసీకి చెప్పినట్టు తెలిసింది. దీంతో అధికారులు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ మధుమూర్తిని ముఖ్య అతిథిగా, కేరళలోని పాలక్కాడ్ ఐఐటీ డైరెక్టర్ ఎ.శేషాద్రి శేఖర్‌ను గౌరవ అతిథిగా ఆహ్వానించారు. ఈ నెల 26న బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే శతాబ్ది వేడుకల ప్రారంభోత్సవ కార్యక్రమానికి వీరు హాజరుకానున్నారు. అదేరోజు ఉదయం బీచ్ రోడ్డులో వాక్‌థాన్ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ జెండా ఊపి ప్రారంభిస్తారు. అలాగే, ఏయూలో వందేళ్ల ఉత్సవాలకు సంబంధించిన బెలూన్ ఎగురవేసే కార్యక్రమాన్ని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ చేపడతారు. మిగిలిన కార్యక్రమాలన్నీ పూర్తిగా ఏయూ అధికారులు ఆధ్వర్యంలో జరగనున్నాయి. వేడుకలను సాదాసీదాగా ప్రారంభించడంపై వర్సిటీ వర్గాలు పెదవివిరుస్తున్నాయి. అదే సమయంలో దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో ఒకటైన ఏయూ వందేళ్ల వేడుకల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వమే తీసుకుని ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం అధ్యాపక వర్గాల్లో వ్యక్తమవుతోంది.

ఐటీ భవనాలన్నీ ఖాళీ!

... 5వ పేజీ తరువాయి

ఇచ్చింది. అందులో కూడా ఎటువంటి కార్యకలాపాలు చేపట్టలేదు. ఉపాధి కల్పిస్తామని ఇచ్చిన హామీని పూర్తి చేయకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం విప్రోకు భూమి రిజిస్ట్రేషన్ చేయకుండా ఆపేసింది. ఇప్పటికీ అదే పరిస్థితి కొనసాగుతోంది. అందులో కొన్ని (2, 5, 6) అంతస్థులను ఆరేళ్ల క్రితం 2019లో ఒమిక్స్ ఇంటర్నేషనల్ (పల్సస్) సంస్థకు అద్దెకు ఇవ్వగా వారు దాదాపు వెయ్యి మందికి ఉపాధి కల్పించారు. అయితే అక్కడి నుంచి ఐటీ ఉత్పత్తులను విదేశాలకు రాయితీపై ఎగుమతి చేసుకునే అవకాశం లేకపోవడంతో ఆ సంస్థ కూడా కొద్ది కాలానికే ఖాళీ చేసి వెళ్లిపోయింది. ఒమిక్స్ అద్దెకు తీసుకున్న భవనం సెజ్ పరిధిలో లేకపోవడమే దీనికి కారణం. అంతకుముందు విప్రోతో లీజు ఒప్పందానికి ఒమిక్స్ యత్నించింది. ఆ భూమి విప్రో పేరుతో లేదని రిజిస్ట్రేషన్ల శాఖ తిరస్కరించింది. దాంతో ఒమిక్స్ ఆ ప్రాంగణం ఖాళీ చేసింది. తాజాగా ఈ నెల మొదటి వారంలో తమను మోసం చేశారంటూ విప్రోపై ద్వారకానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టింది. విదేశాలకు ఐటీ ఎగుమతులు చేసుకునే అవకాశం లేకపోవడంతో దాదాపు రూ.200 కోట్ల వరకు నష్టపోయామని ఆరోపించింది. ప్రస్తుతం విప్రో చేతిలో ఏడు ఎకరాలు ఉండగా, నామమాత్రపు ఉద్యోగులతోనే నడుస్తోంది.

పదో తరగతి ఫలితాల్లో భాష్యం విద్యార్థుల హవా


ప్రతిభావంత విద్యార్థులతో భాష్యం పాఠశాల ఉపాధ్యాయులు

సీతమ్మధార, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ద్వారకానగర్‌లో గల భాష్యం పాఠశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. పరీక్షలకు హాజరైన 131 మంది విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వారకానగర్ బ్రాంచ్ భాష్యం పాఠశాల్లో చదువుతున్న తీగల నవ్య 593 మార్కులు సాధించింది. 35 మంది విద్యార్థులకు 550 పైగా మార్కులు వచ్చాయి. 65 మందికి 500పైగా వచ్చాయి. గణితంలో వందకి వంద మార్కులను ఆరుగురు విద్యార్థులు, 90కి పైగా 58 మంది సాధించారు. సైన్స్‌లో వందకి వంద మార్కులు నలుగురికి, 90కి పైగా మార్కులు 63 మందికి లభించాయి. భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ రామకృష్ణ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ విజయానికి కారకులైన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి, సహకరించిన తల్లిదండ్రులకు రామకృష్ణ, విశాఖలోని విద్యాసంస్థల పీఈఓ ఎం.సత్యం, జోనల్ ఇంచార్జ్ కె.వెంకట్ అభినందించారు.

అందుబాటులోకి నూతన క్యూ కాంప్లెక్స్


చందనం అరగతీస్తున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

సింహాచలం, ఏప్రిల్ 24 (ఆంధ్ర జ్యోతి) : సింహగిరిపై భక్తుల సౌకర్యా ర్థం ప్రసాద్ పథకం నిధులతో నిర్మిం చిన నూతన క్యూ కాంప్లెక్స్ భవనం గురువారం నుంచి అందుబాటులోకి వచ్చింది. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఈఓ సుబ్బారావు, 98వ వార్డు కార్పొరేటర్ నరసింహంతో కలిసి ప్రత్యేక పూజల అనంతరం నూతన క్యూ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. ఈనెల 30న జరిగే చందనోత్సవం నేపథ్యంలో భక్తులకు నీడ కల్పిస్తూ ఒకే సారి ఐదువేల మందికి సరిపడేలా ఈ భవనంలో క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఈ డిజి శ్రీనివాసరాజు, ఏఈలు బాబ్జీ, రవికుమార్, ఏఈఓ ఆనందకుమార్, 98వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చందనం అరగదీతలో ప్రముఖులు

చందనం అరగదీతలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పీవీజీఆర్ నాయుడు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, దేవస్థానం ఈఈ డిజి శ్రీనివాసరావు, తదితరులు పంచె ధరించి నోటికి గుడ్డ కట్టుకుని భక్తిప్రపత్తులతో చందనం అరగదీశారు.

అప్పన్న భక్తుడికి టోకరా

సింహాచలం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామి భక్తులు తరచూ అనేక మోసాలకు గురవుతున్నారు. ముఖ్యంగా రద్దీ రోజుల్లో దర్శనం చేయిస్తామని చెప్పి గుర్తు తెలియని వ్యక్తులు భక్తుల నుంచి నగదు దోచుకుంటున్నారు. గురువారం విజయవాడకు చెందిన భక్తుడొకరు స్వామివారి దర్శనానికి ఐదుగురు కుటుంబ సభ్యులతో కలిసి సింహగిరికి వచ్చారు. రద్దీగా ఉండడంతో మార్గం కోసం వెదుకుతుండగా ఎస్‌బీటీ కౌంటర్‌కు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి భక్తుడ్ని కలిసి మీకు త్వరగా దర్శనం కలిపిస్తానని నమ్మబలికాడు. అందుకు రూ.1500 ఖర్చవుతుందని చెప్పారు. నగదు తీసుకున్న మోసగాడు తిరిగి ఎప్పటికీ రాకపోవడంతో మోసపోయినట్టు భక్తుడు నిర్ధారించుకుని దేవస్థానం పీఆర్ఓ కార్యాలయంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

అవిశ్వాస తీర్మానంలో అందరూ పాల్గొనాలి: వంశీకృష్ణ శ్రీనివాస్


జనసేన నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

సీతంపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని జనసేన కార్యాలయంలో ఆ పార్టీ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కార్పొరేటర్లు గురువారం సమావేశమయ్యారు. ఈ నెల 26న జరగనున్న డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి సంబంధించి పలు అంశాలను ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రస్తావించారు. జనసేన పార్టీ 14 మంది కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. జీవీఎంసీలో ఫ్లోర్ లీడర్ వసంత లక్ష్మీ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు గోవింద్ రెడ్డి, మూర్తియాదవ్, మేరీ జాన్స్ సాదిక్, కందుల నాగరాజు, ఉషశ్రీ, కామేశ్వరి, సూర్యకుమారి, వంశీరెడ్డి, బెహరా భాస్కరరావు, ఆళ్ల లీలావతి, ఎలమంచిలి ఎమ్మెల్యే విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.


రామ అప్పారావును సత్కరిస్తున్న దృశ్యం

63 ఏళ్ల వయసులో ఇంటర్ ఉత్తీర్ణత

రామ అప్పారావును సత్కరించిన ప్రజా సంఘాల ప్రతినిధులు

అగనంపూడి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలసకు చెందిన పట్టా రామఅప్పారావ 63 ఏళ్ల వయసులో ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలు రాసి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఈ సందర్భంగా ఆయనను గురువారం స్థానిక ప్రజా సంఘాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. చదువు పట్ల ఆసక్తి ఉంటే వయసుతో సంబంధం లేకుండా రాణించవచ్చని రామఅప్పారావు నిరూపించారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు మోటూరి వెంకటరమణ, మజ్జి శ్రీనివాసరావు, విందుల నారాయణరావు, గుదే సుశీలగజేంద్రరరావు, సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కేవీలో ప్రవేశాలను చేపట్టాలి

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని కేంద్రీయ విద్యాలయంలో 1, 11వ తరగతుల్లో ప్రవేశాల ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారాం డిమాండ్ చేశారు. అడ్మిషన్లు ప్రారంభించాలని డిమాండ్‌తో గురువారం స్కూల్ గేటు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ఆదేశాల మేరకే ఉక్కు యాజమాన్యం కేవీ, వీవీవీ స్కూల్‌ను మూసేయాలని కుట్ర చేస్తుందని ఆరోపించారు. అందువల్లే ఈ ఏడాది అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించలేదన్నారు. అదే విధంగా ఉక్కు ఆస్పత్రిని కూడా ప్రైవేటీకరించేందుకు సిద్ధపడుతుందన్నారు. ఈ అంశాలపై స్థానిక ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామస్వామి, వైటీ దాసు, పుల్లారావు, మొహిద్దీన్, చిరంజీవి, భుజంగరావు, తదితరులు పాల్గొన్నారు.

సెమిస్టర్ పరీక్షలకు అనుమతి ఇవ్వాలని విద్యార్థుల ఆందోళన

విశాఖపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఏయూలోని ఇంజనీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్, సివిల్ ఇంజనీరింగ్ మొదటి ఏడాది రెండో సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు కొందరు వీసీ కార్యాలయం ఎదుట గురువారం సాయంత్రం ఆందోళన నిర్వహించారు. ఈ రెండు విభాగాలకు చెందిన 30 మంది విద్యార్థులకు హాజరు తక్కువగా ఉందని పరీక్షలకు అనుమతించలేదు. దీంతో వారు తమను పరీక్షలకు అనుమతించాలని ఆందోళన చేశారు. 60 శాతం కంటే తక్కువ ఉన్న వారిని పరీక్షలకు ఆపినట్టు చెబుతున్నారని, కానీ 40 శాతం కంటే తక్కువ హాజరు ఉన్న విద్యార్థులు కూడా పరీక్షలకు హాజరైనట్టు వారు తెలిపారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థి సంఘ నాయకులు వెంకట రమణ, అభిషేక్, సంజు, వికాస్, సోమేశ్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **సారంగపాణి జాతకం :** శారద, శ్రీరామ, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లలిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)
- **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 10, వంకాయలు (తెలుపు) 15, వంకాయలు (నలుపు) 15, బెండకాయలు 20, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 30, బీరకాయలు 32, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 24, క్యాబేజీ 14, క్యారెట్ 32 దొండకాయలు 16, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది)48, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 52, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, కీరదోస 22, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 36, కంద 80, దేముడుచిక్కుడు 64, గోరుచిక్కుడు 28, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220


ఓ కంపెనీ ప్రతినిధికి జ్ఞాపిక అందజేస్తున్న ఎంపీ శ్రీభరత్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పక్కన మెగా జాబ్ మేళాకు హాజరైన యువతీ యువకులు

జాబ్ మేళాలతో ఉపాధి అవకాశాలు

- విశాఖ ఎంపీ శ్రీభరత్
- ఉపాధి అవకాశాల మెరుగుకు ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యం గల యువతే దేశాభివృద్ధికి పునాదులని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ యువత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని తన నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు నిర్వహించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాలకు విశేష స్పందన వస్తుందని పేర్కొన్నారు. అనంతరం మేళాలో పాల్గొన్న సుమారు 60 కంపెనీల ప్రతినిధులకు ఎంపీ, కలెక్టర్ జ్ఞాపికలను అందజేశారు. ఈ జాబ్ మేళాలో సుమారు మూడు వేల మంది అభ్యర్థులు పాల్గొనగా వెయ్యి మందికి కొలువులు లభించాయి. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఏపీసీపీఎస్‌జీఎఫ్ఎల్ చైర్మన్ గండి గండి బాబ్జీ, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న పవన్‌కల్యాణ్

నగరానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

గోపాలపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ ఉగ్రదాడుల్లో మృతి చెందిన నగరవాసి జేఎస్ చంద్రమౌళి కుటుంబాన్ని పరామర్శించడానికి రాష్ట్ర డిప్యూటీ సీఎం కె.పవన్‌కల్యాణ్ గురువారం రాత్రి నగరానికి చేరుకున్నారు. తిరుపతి నుంచి ఇక్కడకు రాత్రి 8.15 గంటలకు ఆయన చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గం గుండా నగరంలోకి వెళ్లారు. ఆస్పత్రిలో ఉన్న చంద్రమౌళి మృతదేహానికి నివాళులర్పించాక కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాత్రికి నగరంలోనే ఆయన బస చేశారు. శుక్రవారం ఉదయం ఆయన రాజమండ్రి బయలుదేరనున్నారు.

పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు స్వాగతం

నగర పర్యటనకు విచ్చేసిన పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. గురువారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి విశాఖ చేరుకున్న ఆమెకు పార్టీ నాయకులు స్వాగతం పలికారు.

మే 20న కార్మిక సమ్మెపై 'ఉక్కు'లో భిన్నాభిప్రాయాలు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అఖిలభారత కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు మే 20న దేశవ్యాప్తంగా తలపెట్టనున్న జాతీయ కార్మిక సమ్మెపై స్టీల్‌ప్లాంటులో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంపై గురువారం టౌన్‌షిప్‌లో సమావేశమై సమ్మె చేద్దామని కొన్ని కార్మిక సంఘాల నాయకులు ప్రతిపాదించగా... ప్రస్తుత సమయంలో సమ్మె చేయడం మంచిది కాదని, ఇప్పటికే ప్లాంటులో విభిన్న పరిస్థితులు ఉన్నందున ఇబ్బందికరమైన పరిస్థితులు వస్తాయని పలువురు పేర్కొన్నారు. కాగా కొన్ని కార్మిక సంఘాలు మాత్రం సమ్మె వద్దని, జాతీయ సంఘాలు పిలుపునిచ్చిన నేపథ్యంలో కేవలం నిరసన తెలుపుదామని ప్రతిపాదించారు. అయితే సమ్మె చేస్తే ఉక్కు యాజమాన్యం దిగి వస్తుందని, కార్మికుల సమస్యలను పరిష్కరిస్తుందని, అందువల్ల సమ్మె చేయడమే మంచిదని అతి తక్కువ మంది పేర్కొనగా, పెద్ద కార్మిక సంఘ నాయకులు మాత్రం ఒప్పుకోలేదని తెలిసింది. ఏదిఏమైనా సమ్మె వద్దని మాత్రం ఎక్కువ మంది కార్మిక నాయకులు ప్రతిపాదించారు. దీనిపై మరోసారి సమావేశమై నిర్ణయం తీసుకుంటామని కార్మిక నాయకులు పేర్కొన్నారు.

కూటమి కన్వీనర్ దినకర్‌కు గణబాబు అభినందనలు

మల్కాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించడానికి ఎంతో కృషి చేసిన ఏడు వార్డుల కూటమి కన్వీనర్ విశ్వనాథుల దినకర్‌కు రాష్ట్ర ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గాజువాక డిపో ప్రాంతంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో గణబాబు పాల్గొని దినకర్‌ను ప్రత్యేకంగా అభినందించి కేక్ తినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటువంటి నాయకులు పార్టీకి ఎంతో అవసరమన్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను చేపట్టాలని దినకర్‌కు సూచించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గురువారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఖాళీగా ఉన్న ఎన్ఏడీ ఫ్లైవోవర్..


3 గంటల సమయంలో వెలవెలబోతున్న వేపగుంట జంక్షన్

ఎండదెబ్బకు వెలవెలబోతున్న రోడ్లు

అత్యవసరమైతే తప్పా బయటకు రాని నగరవాసులు

ఎన్.ఎ.డి.జంక్షన్/వేపగుంట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు భానుడు ఉగ్ర రూపం దాలుస్తుండడంతో నగరవాసులు బయటకు వచ్చేందుకే భీతిల్లుతున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండ తీవ్రత మొదలవుతుండడంతో అత్యవసరమైతే తప్పా ప్రజలెవరూ బయటకు వచ్చేందుకు సాహసించడం లేదు. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఎన్ఏడీ జంక్షన్, వేపగుంట కూడలి గురువారం మధ్యాహ్నం వెలవెలబోతూ కనిపించాయి. ఎండ తీవ్రత నేపథ్యంలో వేపగుంట పరిసరాల్లోని వ్యాపార సముదాయాలు, చిన్న చిన్న దుకాణాలకు జన తాకిడి లేకపోవడంతో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు మూసివేస్తున్నారు. అయితే శీతల పానీయాల అమ్మకాలు మాత్రం జోరుగా సాగుతున్నాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

నిర్వహణ పనుల నేపథ్యంలో నిలిపివేస్తున్నట్టు పేర్కొన్న ఈపీడీసీఎల్ అధికారులు

మల్కాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. ఈ కారణంగా ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఏకేసీ కాలనీ, కేకేఎల్‌జీ వీఎంసీ పంప్ హౌస్, ఈఎస్ఐ ఆస్పత్రి, సింధియా జంక్షన్, పోస్టాఫీసు, మసీదు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే దుర్గానగర్ ఫీడర్ పరిధిలో గల గుడివాడ అప్పన్నకాలనీ, దుర్గానగర్, ఎన్టీఆర్ కాలనీ, తెలుగుదేశం కాలనీ, అంబేడ్కర్ కాలనీలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి తమకు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

పెందుర్తి: చినముషిడివాడ సబ్ స్టేషన్ 33/11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతు పనులు చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా గొల్లవిల్లిపాలెం, ఎల్ఐసీ కాలనీ, భవానీనగర్, పాపయ్యరాజుపాలెం, సాయిసౌధా నగర్, సూర్యనగర్, ఆర్టీసీ లేఅవుట్, శివగాయత్రీ నగర్, పాపయ్యరాజుపాలెం బీసీ కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

గోపాలపట్నం: లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా బాజీ జంక్షన్, రెడ్డివీధి, సుసర్లకాలనీ, జయప్రకాశ్‌నగర్, ఎస్సీకాలనీ, విద్యానగర్, రవీంద్రనగర్, రైల్వే స్టేషన్ ఏరియా, నాయుడు క్వార్టర్స్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

కూర్మన్నపాలెం: వడ్లపూడి సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ కారణంగా వడ్లపూడి, సిద్ధార్థ నగర్, గవరవీధి, శెట్టిబలిజ వీధి, కాళింగ వీధి, రాజులపాలెం, లక్ష్మీపురం, సంతమామిడితోట, తిరుమలనగర్, గణేశ్ నగర్, ఆటో నగర్ ఈ-బ్లాక్, అపెరల్ పార్కు, ఓషియన్ గ్రీన్స్ కాలనీలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ సబ్ స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వరకాలనీ, జగ్గయ్యపాలెం, షీలానగర్ 11కేవీ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని జోన్-2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. ఈ కారణంగా షీలానగర్, హరిజన జగ్గయ్యపాలెం, వెంకటేశ్వరకాలనీ, గవర జగ్గయ్యపాలెం, కిమ్స్ ఆస్పత్రి ఏరియా, పోర్టు రోడ్డు, కుమిలి లేఅవుట్, ఎస్టీబీఎల్, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

వేపగుంట: విరాట్‌నగర్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా విరాట్‌నగర్, ప్రహ్లాదపురం, సింహాద్రినగర్, బాలాజీ గార్డెన్స్ ఆర్టీసీ డిపో, గొల్లనారాయణపురం, కృష్ణానగర్, దుర్గానగర్, నాయుడుతోట, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఉగ్రదాడిలోని మృతులకు నివాళులర్పిస్తూ శాంతి ర్యాలీ


చినముషిడివాడ కూడలిలో కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న జనసేన నాయకులు, తదితరులు

పెందుర్తి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ ఉగ్రదాడిలో అశువులు బాసిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి కొవ్వొత్తులు, ప్లకార్డులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. సుజాత నగర్‌లోని జనసేన పార్టీ కార్యాలయం నుంచి నల్ల బ్యాడ్జీలు ధరించి నాయకులు, వీరమహిళలు, జనసైనికులు ప్రదర్శనగా తరలివచ్చి చినముషిడివాడ కూడలిలో నిరసన తెలిపారు. ముష్కరుల దాడిలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అయిలి సింహాచలం, వేగి దివాకర్, పిళ్లా జగన్మోహనపాత్రుడు, సేనాపతి సోమశేఖర్, డీబీఎల్ నాయుడు, గొర్లె అప్పారావు, పిన్నింటి వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: కశ్మీరులో జరిగి ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పిస్తూ 87వ వార్డు తిరుమల నగర్ కాలనీవాసులు గురువారం రాత్రి కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కణితి నుంచి వడ్లపూడి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.నాగభూషణం, జి.విశ్వేశ్వరరావులు మాట్లాడుతూ పర్యాటకులపై ఉగ్రవాదులు దాడులు చేసి హతమార్చడం ఎంతో బాధాకరమన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు ఎం.పరమానందం, సన్యాసిరావు, వసంత రెడ్డి, సత్యనారాయణ, మహేశ్, సునీత, చిట్టి, లక్ష్మి, రాణి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

పెదగంట్యాడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో మే 10, 11 తేదీల్లో జరగనున్న సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కె.సత్యనారాయణ కోరారు. ఇక్కడి పోతన సన్యాసిరావు భవన్‌లో గురువారం సీపీఐ మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతర పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.ఆనంద్, కె.అచ్యుతరావు, దుర్గారావు, ఎ.విష్ణుమూర్తి, పోతయ్య, కె.వనజాక్షి, పి.సూర్యపద్మ, తదితరులు పాల్గొన్నారు.


పూజలందుకుంటున్న నూకాలమ్మ, ఘటాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

వైభవంగా నూకాంబిక ఉత్సవాలు ప్రారంభం

పెదగంట్యాడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి అశోక్‌నగర్‌లో నూకాంబిక ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏటా మాదిరిగానే ఈసారి కూడా అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ప్రతినిధులు తెలిపారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమపూజలు జరిపారు. సాయంత్రం పురవీధుల్లో అమ్మవారి ఘటాలను ఊరేగించారు. అనంతరం అమ్మవారికి ప్రసాద నివేదన చేశారు. శనివారం సాయంత్రం అమ్మవారి ఊరేగింపుతో ఉత్సవాలు ముగుస్తాయి.

86వ వార్డులో రాసాలమ్మ జాతర


అమ్మవారి సన్నిధిలో 'నల్లూరు' తదితరులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు పరిధి రాసాలమ్మ కాలనీలో గురువారం శ్రీరాసాలమ్మ పండుగను వైభవంగా నిర్వహించారు. ఆలయ, గ్రామ, యూత్ కమిటీల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు రామశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించారు. టీడీపీ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ, జనసేన వార్డు ఇన్‌చార్జి కాదా శ్రీను, తదితరులు అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

దుర్గమాంబ అనుపోత్సవం

అక్కిరెడ్డిపాలెం: తుంగ్లాం, ఆటోనగర్, చుక్కవానిపాలెం ప్రాంతాల ప్రజల ఆరాధ దేవత దుర్గమాంబ అమ్మవారి అనుపోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి దంపతులు అమ్మవారికి ప్రథమ పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సాయంత్రం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

డొంకాడలో దుర్గమాంబ పండగ

అగనంపూడి: డొంకాడ, ఉక్కు నిర్వాసిత గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత దుర్గమాంబ పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి పసుపుకుంకుమలు, పట్టు వస్త్రాలను సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు దాసరి త్రినాథరావు, అట్టా అప్పారావు, పెంటారావు, డి.సన్యాసిరావు, విశ్వనాథ్, కె.శ్రీను, సత్తిబాబు, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఫార్మాసిటీ పునరావాస కాలనీ కొత్తపాలెంలో దుర్గమాంబ మారువారం పండగలను ఘనంగా నిర్వహించారు.

మరిడిమాంబ పండగ పోస్టర్ ఆవిష్కరణ

పెందుర్తి: పెందుర్తి ప్రజల ఆరాధ్య దేవత మరిడిమాంబ పండగను ఈనెల 27న నిర్వహించనున్న నేపథ్యంలో గురువారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవ నిర్వహణకు సంబంధించిన పోస్టరును ఇక్కడి వేగి కార్యాలయంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగలు గ్రామ సంస్కృతికి చిహ్నమన్నారు.

డ్రైవింగ్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గాజువాక, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్టీల్ సిటీ ఐటీఐలో డ్రైవింగ్‌లో శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. హెవీ వెహికల్ మోటార్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఆసక్తి గల అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండడంతో పాటు హెవీ వెహికల్ ఎల్ఎల్ఆర్ కలిగి ఉండాలని సూచించారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఎల్ఎల్ఆర్‌తో మే 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94917 62841 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

గాజువాక, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 67వ వార్డుకు చెందిన రండి వరలక్ష్మికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును గురువారం కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో పాలన సాగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లా రంగాయాదవ్, కృష్ణమూర్తి, అచ్చిబాబు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్‌ను విక్రయిస్తే చర్యలు

- శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్
- 12 కిలోల ప్లాస్టిక్ సామగ్రి స్వాధీనం

మల్కాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని కలిగించే నిషేధిత ప్లాస్టిక్‌ను విక్రయిస్తే చర్యలు తప్పవని 61వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్ హెచ్చరించారు. గురువారం ఆయన మల్కాపురం, వెంకన్నపాలెం, ప్రకాశనగర్, రామకృష్ణపురం, జనతా కాలనీ ప్రాంతాల్లో ఉన్న దుకాణాలలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 12 కిలోల నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. దుకాణదారులందరూ ట్రేడ్ లైసెన్స్‌లు కలిగి ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవన్నారు. లైసెన్స్‌లకు సకాలంలో రెన్యూవల్ చేయించుకోవాలని కోరారు. తనిఖీల్లో పలువురు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను తొలగించవద్దంటూ లేఖ

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదని కోరుతూ ఢిల్లీలోని చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్)కు ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు గురువారం లేఖ రాశారు. ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులను తొలగించేందుకు యాజమాన్యం పూనుకుందని, ఇటీవల కొంతమందిని తొలగించిందని, అలాగే మరికొంతమందిని కూడా తొలగించేందుకు సిద్ధపడుతుందని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులను ఒక్కసారిగా విధుల నుంచి తప్పిస్తుండడంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు.

పరిశుభ్రతే రక్ష!



కంటికి సరిగా కనిపించని దోమ మనిషి ప్రాణాలు హరించే స్థాయిలో హాని చేస్తుంది. ముఖ్యంగా ఆడ ఎనాఫిలిస్ దోమ యమపాశం లాంటిది. ఆహార సేకరణలో భాగంగా మనిషి రక్తాన్ని పీల్చే సందర్భంలో విడుదల చేసే స్పోరోజాయిడ్స్ మనకు తెలియకుండానే ప్రాణాలు హరిస్తాయి. రక్తంలో చేరిన వెంటనే కాలేయాన్ని ఆశ్రయించి విజృంభిస్తాయి. వీటి ఎదుగుదలను సకాలంలో గుర్తించకపోతే మలేరియా మహమ్మారి ప్రాణాలను కబళిస్తుంది.



ఏటా వణికిస్తున్న మలేరియా

- అవగాహన లోపమే కారణం
- ఉమ్మడి జిల్లాలో తీవ్రత అధికం
- ఏజెన్సీలో భారీగా నమోదవుతున్న కేసులు
- వర్షాకాలంలో దోమల విజృంభణ
- ప్రభావం చూపిన ముందస్తు చర్యలు
- నేడు ప్రపంచ మలేరియా వ్యతిరేక దినోత్సవం

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

ఏజెన్సీ ప్రాంతం అధికంగా ఉన్న ఉమ్మడి విశాఖ జిల్లాను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వ్యాధుల్లో మలేరియా ఒకటి. వర్షాకాలంలో ఆందోళన రేకెత్తించే స్థాయిలో ఈ వ్యాధి ప్రబలుతుంటుంది. ముందస్తు జాగ్రత్తలు, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా కేసుల సంఖ్య అదుపులోకి రావడం లేదు. నేడు ప్రపంచ మలేరియా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లాలో మలేరియా పరిస్థితి, వ్యాధి విజృంభణకు కారణాలు, అందుతున్న సేవలపై కథనం.

మలేరియా ప్రపంచాన్నే వణికిస్తోంది. ఏటా వ్యాధి బారిన పడుతున్న వారి సంఖ్య అధికంగా నమోదవుతోంది. ప్రభావాన్ని తగ్గించి, మరణాలను అదుపుచేసేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. ఏటా ప్రత్యేక థీమ్‌తో కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఈ ఏడాది 'మలేరియా మనతో ముగుస్తుంది' థీమ్‌తో ప్రజల్లో అవగాహన కల్పించనున్నారు.

ఇలా వ్యాపిస్తుంది

ఆడ ఎనాఫిలిస్ దోమ ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుంది. దోమ లాలాజల గ్రంథుల్లో స్పోరోజాయిడ్స్ ఉంటాయి. దోమ కుట్టగానే విడుదలయ్యే వీటితో అత్యంత ప్రమాదమని నిపుణులు చెబుతున్నారు. స్పోరోజాయిడ్స్ రక్తంలోకి వెళ్లిన అరగంటలోనే కాలేయ కణాల్లోకి చేరిపోయి సెల్స్‌ను పగలగొడతాయి. పదినుంచి పన్నెండు రోజుల్లో జ్వర లక్షణాలు కనిపిస్తాయి. దీనినే ఇంక్యుబేషన్ పీరియడ్ అంటారు. ఈ సమయంలో రక్త పరీక్షలు చేయించుకోవడం ద్వారా మలేరియా వ్యాధిని గుర్తించవచ్చు. సాధారణంగా జూన్ నుంచి అక్టోబరు మధ్య మలేరియా వ్యాపిస్తుంది. ఈ కాలంలో వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో నీటి నిల్వలు పెరిగి దోమల వృద్ధికి దోహదపడుతుంది. ఏజెన్సీలో దోమల ప్రభావం ఎక్కువ. అక్కడే ఎక్కువ కేసులు నమోదవుతాయి.

ఏజెన్సీలో తీవ్రతకు కారణాలు

ఏజెన్సీలో మలేరియా కేసులు అధికంగా నమోదవడానికి పలు అంశాలు దోహదం చేస్తున్నట్టు అధికారులు వివరిస్తున్నారు. ప్రధానంగా మలేరియా దోమ ప్రబలడానికి అనుకూల వాతావరణం, తక్కువ టెంపరేచర్, ఏడాది పొడుగునా పారే సెలయేళ్లు, కొండలు, అడవులకు దగ్గరలో గిరిజన పల్లెలు ఉండడం కారణంగా భావిస్తున్నారు.

చర్యలతో రాని ఫలితం

మలేరియా రహిత జిల్లాగా మార్చేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నా ఫలితాలు రావడంలేదు. సిబ్బంది నిర్లక్ష్యం, క్షేత్రస్థాయికి అవగాహన కార్యక్రమాలు చేరకపోవడం కారణం. ఎపిడమిక్ ప్రిపరేషన్‌లో భాగంగా దోమ తెరలను ఉచితంగా పంపిణీ చేస్తున్నా ఎక్కువ మంది గిరిజనులు ఉపయోగించకపోవడం వల్ల ఫలితం కనిపించడంలేదు. దోమల నివారణ మందు పిచికారీకి కూడా తగిన సహకారం లభించడం లేదు.

రెండు రకాల పరీక్షలతో నిర్ధారణ

మలేరియా నిర్ధారణకు రక్తపూత, ర్యాపిడ్ డయాగ్నస్టిక్ టెస్ట్ కిట్ (ఆర్‌డీటీ) ద్వారా పరీక్షిస్తారు.

- ఆడ ఎనాఫిలిస్ దోమ వల్లే మలేరియా వ్యాపిస్తుంది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- వాటర్ ట్యాంకుల మూతలు బిగించి ఉంచాలి.
- ఇంట్లో తప్పనిసరిగా దోమతెరలు వాడాలి.
- నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలి.
- జ్వరమేదైనా రక్త పరీక్ష చేయించుకోవాలి.
- మలేరియా వ్యాధి వచ్చినట్టు నిర్ధారిస్తే పూర్తి చికిత్స తీసుకోవాలి.
- జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్య కార్యకర్తలకు సమాచారాన్ని అందించాలి.

ఆర్‌డీటీ పరీక్షలతో..

వ్యాధి నిర్ధారణకు గత కొద్ది కాలంగా ఆర్‌డీటీ పరీక్షలు చేస్తున్నారు. మలేరియా నాలుగు రకాలు. ప్లాస్మోడియం ఫాల్సీఫారమ్, ప్లాస్మోడియం వివాక్స్, ప్లాస్మోడియం మలేరియో, ప్లాస్మోడియం ఒవేల్. జిల్లాలో రెండే ప్రభావం చూపిస్తుండగా ప్లాస్మోడియం ఫాల్సీఫారమ్ కేసులు అధికమని గుర్తించారు. ప్లాస్మోడియం ఫాల్సీఫారమ్ మూడు రోజులు, ప్లాస్మోడియం వివాక్స్‌కు 14 రోజుల చికిత్స అందిస్తారు. ప్లాస్మోడియం వివాక్స్ బాధితులకు క్లోరోక్విన్ ప్రైమాక్విన్, ఫాల్సీఫారమ్‌కు ఆర్టీమిషన్ ఇన్ బేస్డ్ థెరపీ, ప్రైమాక్విన్ మందులు అందిస్తారు.

ఇదీ కేసుల లెక్క..

2023లో జిల్లాలో జ్వరంతో బాధపడుతున్న 2,46,047 మంది నుంచి నమూనాలు సేకరించగా, 110 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. 2024లో 2,74,946 మంది జ్వర బాధితులు నుంచి నమూనాలు సేకరించి మలేరియా పరీక్ష నిర్వహించగా 165 మందికి పాజిటివ్‌గా తేలింది. 2025 జనవరి నుంచి ఏప్రిల్ 20 వరకు జ్వరంతో బాధపడుతున్న 60,976 మంది నుంచి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించగా.. 30 మందికి మలేరియా సోకినట్టు నిర్ధారణ అయింది.

నియంత్రణకు పటిష్ఠ చర్యలు

జిల్లాలో మలేరియా కేసులను నియంత్రించేందుకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నాం. దోమలు వ్యాప్తి చెందకుండా ప్రజలకు అవగాహన కలిగిస్తునే.. మరోవైపు కేసులను వేగంగా గుర్తించేందుకు సర్వైలెన్స్ చేపడుతున్నాం. అనుమానిత ఫీవర్ కేసులున్న ఇళ్లకు వెళ్లి నమూనాలు సేకరించి పరీక్షలు చేయిస్తున్నాం. నిర్ధారణ అయిన వారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. యాంటీ లార్వల్ ఆపరేషన్స్, ఫోకల్ స్ప్రే చేయిస్తున్నాం. నిరంతరం ఫాగింగ్ నిర్వహిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ, అర్బన్‌లో మునిసిపల్ అధికారులతో కలిసి మలేరియా నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం. జిల్లాలోని ప్రజలకు పంపిణీ చేసేందుకు అవసరమైన 1.68 లక్షల దోమతెరలకు ఇండెంట్ పెట్టాం. కొద్దిరోజుల్లోనే అందుబాటులోకి వస్తాయి. జూన్, జూలైలో వీటిని పంపిణీ చేస్తాం.

- డాక్టర్ తులసి, జిల్లా మలేరియా అధికారి

పదో తరగతి పరీక్షల్లో వన్ వరల్డ్ స్కూల్ ఘన విజయం



గణేశ్ (581), చంద్రిక (578), ప్రీతిహాస (578)

పెదవాల్తేరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో లాసన్స్ బే కాలనీలోని వన్ వరల్డ్ స్కూల్ విద్యార్థులు నూరుశాతం ఫస్ట్ క్లాస్ పాస్‌తో మరో విజయం సాధించారు. 581 మార్కులతో గణేష్ ప్రథమస్థానం, 578 మార్కులతో మరో ఇద్దరు ద్వితీయ స్థానంలో నిలిచారు. పరీక్షకు హాజరైన మొత్తం 44 మందిలో 30 మంది 500లకు పైగా మార్కులు సాధించడం, 13 మంది 70 శాతానికి పైగా మార్కులతో పాసవగా, ఒక్క విద్యార్థిని 54 శాతం మార్కులతో ఉత్తీర్ణురాలైంది. వీరంతా పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన పిల్లలని స్కూల్ డైరెక్టర్ సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. పెదవాల్తేరు, పెదజాలారిపేట, చిన వాల్తేరుకు చెందిన వారని వివరించారు.

చంద్రమౌళి కుటుంబానికి పవన్ ఓదార్పు



ఆస్పత్రిలో చంద్రమౌళి మృతదేహం వద్ద ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



చంద్రమౌళి ఇంటి వద్ద మీడియాతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్

కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో అశువులు బాసిన జేఎస్ చంద్రమౌళి భౌతికకాయానికి గురువారం రాత్రి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఘన నివాళి అర్పించారు. జిల్లా పరిషత్ కూడలిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఉన్న చంద్రమౌళి మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా కొద్దిసేపు మౌనం పాటించారు. అనంతరం చంద్రమౌళి ఇంటికి చేరుకుని కుటుంబసభ్యులను ఓదార్చారు. వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పవన్ వెంట మంత్రులు అనిత, బాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యేలు ఉన్నారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

ఐకానికా సిటీ ఆఫ్ గోల్డ్‌కు శంకుస్థాపన

బ్రోచర్ విడుదల చేసిన చినజీయరు స్వామి





శంకుస్థాపన చేస్తున్న చినజీయరు స్వామి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, చైర్మన్ కొట్టు మురళీకృష్ణ, ఎండీ సంతోష్ తదితరులు, బ్రోచర్ విడుదల చేస్తున్న చినజీయరు స్వామి, ఎమ్మెల్యే గంటా తదితరులు

విశాఖపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రుషికొండ ఐటీ పార్కులో మిలీనియం టవర్స్‌ను ఆనుకొని ఉన్న ఎస్‌సీసీకి చెందిన 97 ఎకరాల్లో 'ఐకానికా సిటీ ఆఫ్ గోల్డ్' ప్రాజెక్టుకు గురువారం త్రిదండి చినజీయరు స్వామి శంకుస్థాపన చేసి, బ్రోచర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్టులో అన్ని వసతులు సమకూరుస్తున్నారని, దేవాలయం ఉండేలా చూడాలని సూచించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ గోవా, బెంగళూరు నగరాలు కలిసినట్టు విశాఖపట్నం ఉంటుందని, ఈ ప్రాజెక్టు మోడల్‌గా నిలుస్తుందన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో టీసీఎస్, గూగుల్ వంటి కంపెనీలు విశాఖపట్నం వస్తున్నాయని, పర్యాటక ప్రాజెక్టులు ప్రారంభమవుతున్నాయని, దీంతో రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకుంటుందన్నారు. ఐకానికా గ్రూపు చైర్మన్ కొట్టు మురళీకృష్ణ మాట్లాడుతూ బెంగళూరు, హైదరాబాద్ తరహాలో ఇక్కడ ఐకానిక్ సిటీని నిర్మిస్తామన్నారు. మై హోమ్స్ అధినేత జూపల్లి రామేశ్వరరావు మాట్లాడుతూ గోవాను మించిన అందాలు విశాఖలో ఉన్నాయన్నారు. ఐకానిక్ గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్ మాట్లాడుతూ 97 ఎకరాల విస్తీర్ణంలో విల్లాలు, అపార్ట్‌మెంట్లు, ఆస్పత్రి, స్టార్ హోటల్, కన్వెన్షన్ సెంటర్ వంటివి నిర్మించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి రంగరాజు, అల్లూరి సీతారామరాజు, వేణు, కార్పొరేటర్ లొడగల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పంచాయతీలే మూల స్తంభాలు: కలెక్టర్

విశాఖపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి పంచాయతీలే మూల స్తంభాలని కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సం సందర్భంగా గురువారం జిల్లా పరిషత్ సమావేశమందిరంలో చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకంగా మారిందని, గ్రామాల స్వయం సమృద్ధికి సర్పంచులు, కార్యదర్శులు సేవలందించాలని సూచించారు. స్వయంశాసనం- గ్రామాలు బలపడడం అనే దృక్పథంతో పంచాయతీలను అభివృద్ధి దిశగా నడిపించాన్నారు. సూర్యఘర్ పథకం కింద జిల్లాలో ఎంపికైన గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు వెల్లడించారు. జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ 73వ రాజ్యాంగ సవరణ ద్వారా 1993 ఏప్రిల్ 24 నుంచి దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థకు పునాదులు పడ్డాయని గుర్తుచేశారు. గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచ్‌లు నిధుల సమీకరణపై దృష్టిసారించాలన్నారు. అనంతరం పలువురు సర్పంచ్‌లకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బి.సత్యవతి, డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఔత్సాహికులకు ప్రోత్సాహం

మహారాణిపేట: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సహకరించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా ఇండస్ట్రియల్, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. పారిశ్రామిక కేంద్రాల్లోని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పారిశ్రామిక యూనిట్లు నెలకొల్పేలా చూడాలన్నారు. జిల్లాల్లో నూతన పరిశ్రమల స్థాపనకు వీలుగా మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం తో పాటు నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి జీఎం ఆదిశేషు, తదితరులు పాల్గొన్నారు.

నమ్ముకున్న కార్పొరేటర్లే మోసం చేశారు

- మేయర్ పదవి కోల్పోవడానికి కారణమదే...
- ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స

మద్దిలపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): టికెట్లు ఇచ్చి గెలిపించుకున్న కార్పొరేటర్లే మోసం చేశారని వైసీపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అన్నారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్పొరేటర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు ఎంత చేసినా 175 సీట్లకు 11 మాత్రమే గెలిచామన్నారు. ఓటమి గురించి పట్టించుకోవద్దన్నారు. కార్పొరేటర్లను సమన్వయం చేసుకోవడంలో విఫలమయ్యామని, వారిని గుడ్డిగా నమ్మామని, అందుకే మోసం చేయగలిగారన్నారు. 11 నెలల మేయర్ పదవి కోసం రాజకీయాలు చేశారన్నారు. పార్టీ మీద అభిమానంతో ఉన్న 32 మంది కార్పొరేటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ మేయర్‌పై పెట్టే అవిశ్వాస తీర్మానానికి వెళ్లొద్దని సూచించారు. కూటమి ప్రభుత్వం మన ఆర్థిక మూలాలు, వ్యాపారాలపై దెబ్బకొట్టాలని చూస్తోందన్నారు. సమావేశంలో అనకాపల్లి, విశాఖ జిల్లాల అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్, కేకే రాజు, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, మాజీ మేయర్ హరివెంకటకుమారి, డిప్యూటీ మేయర్లు శ్రీధర్, సతీష్, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, వి.గణేష్‌కుమార్, ఎం.విజయప్రసాద్, సీహెచ్ వెంకట్రామయ్య, పాల్గొన్నారు.

క్రైం... crime news

యువకుడి ఆత్మహత్య



సుధీర్ (ఫైల్)

ఆనందపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పురుగు మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని పొడుగుపాలెం దండువారి కళ్లాల్లో గురువారం జరిగింది. సీఐ చింతా వాసునాయుడు తెలిపిన వివరాల మేరకు దండువారి కళ్లాలకు చెందిన దొంతల సుధీర్ (29) తల్లి రెండేళ్ల కిందట మృతి చెందింది. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఇటీవల పచ్చ కామెర్లు రావడంతో జీవితంపై విరక్తి కలిగి బుధవారం సాయంత్రం తన ఇంటి సమీపంలో పురుగుల మందు సేవించి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సుధీర్ అన్నయ్య కొడుకు రమేష్ గమనించి తగరపువలసలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, మృతుడి తండ్రి దొంతల అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్షణికావేశంలో బాలిక...

మహారాణిపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రేమికుడు కోప్పడ్డాడనే క్షణికావేశంలో ఓ బాలిక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధి కల్లుపాకలకు చెందిన దారపు వెంకటలక్ష్మి (17) ప్రవీణ్ అనే యువకుడితో ఏడాదిగా ప్రేమలో ఉంది. వీరి వివాహానికి అంగీకరించిన ఇరు కుటుంబాలు వచ్చే ఏడాది పెళ్లికి నిర్ణయించారు. వెంకటలక్ష్మి ఓ టీ షాపులో పనిచేస్తోంది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఫంక్షన్ కేటరింగ్‌కు పెందుర్తి వెళ్లింది. ఆ సమయంలో ప్రవీణ ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. రాత్రి 12 గంటలకు ఇంటికి రావడంతో ఫోన్ ఎందుకు తీయలేదని, రాత్రి సమయంలో పనులకు వెళ్లాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రవీణ్ ప్రశ్నించాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్యుద్ధం జరిగింది. వెంకటలక్ష్మి తల్లి ప్రవీణ్‌కు సర్దిచెప్పి పంపింది. అనంతరం వెంకటలక్ష్మి ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసి, ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తలుపులు బద్దలుకొట్టి లోపలికి వెళ్లేసరికే మృతి చెందింది. టూటౌన్ ఎస్‌ఐ మన్మథరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఒకరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

కంచరపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక బర్మాక్యాంప్‌కి చెందిన ఎన్.మేరీ (62), కుమార్తె సుధారాణి (40) చర్చికి వెళ్లి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. ఊర్వశి జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ లగ్జరీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో బండి వెనుక కూర్చున్న మేరీ అక్కడికక్కడే మృతిచెందగా, సుధారాణికి తీవ్ర గాయాలయ్యాయి. కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరథి సుధారాణిని ఆసుపత్రికి తరలించారు. మేరీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. న్యూకాలనీ నుంచి తాటిచెట్లపాలెం మీదుగా కంచరపాలెం వెళ్లేమార్గంలో జరిగిన మరో ప్రమాదంలో ఒక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఆశీర్వాద్ కల్యాణమండపం దగ్గర ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో మహిళకు గాయాలయ్యాయి.ఆమెను ఆస్పత్రికి తరలించి ట్రాఫిక్ సీఐ దాశరథి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపుల కేసులో భర్తకు ఏడాది జైలు

భీమునిపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భార్యను మానసికంగా, శారీరకంగా వేధించిన కేసులో నిందితుడు భర్త కూర్మదాసు అప్పలరాజుకు ఏడాది సాధారణ జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ భీమిలి 15వ ఏజేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి గురువారం తీర్పు నిచ్చారు. ఈ మేరకు భీమిలి పోలీసులు వివరాలు వెల్లడించారు. మండలంలోని చేపలుప్పాడకు చెందిన కూర్మదాసు కుమారి తన భర్త వేధిస్తున్నాడంటూ 2018లో ఫిర్యాదు చేయగా, దర్యాప్తు చేసిన పోలీసులు ముద్దాయి అప్పలరాజుపై 498ఏ, 324 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. మార్చి 4న తీర్పు వెలువడాల్సి ఉండగా ముద్దాయి కోర్టుకు హాజరుకానందున నాన్ బెయిల్ బుల్ వారెంట్ జారీ చేసిందన్నారు. ముద్దాయిని పట్టుకుని గురువారం కోర్టులో హాజరుపర్చగా శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారని సీఐ తిరుమలరావు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి



ఈదల పూర్ణచంద్రిక మృతదేహం

జ్ఞానాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ బాలిక మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. మృతదేహం బోర్లా పడి ఉండడం, తలకు చున్నీ చుట్టి, నోటిలో గుడ్డలు కుక్కి ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. జ్ఞానాపురం పునీతపేతురు దేవాలయం ఆవరణలో వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. విజయనగరానికి చెందిన ఈదలపూర్ణ చంద్రిక (11)కు దెయ్యం పట్టిందంటూ బంధువులు కొద్దిరోజులుగా పలు చర్చిలకు తిప్పుతున్నట్టు తెలిసింది. ఈ క్రమంలో గురువారం ఉదయం జ్ఞానాపురం చర్చికి తీసుకువచ్చారని, అయితే తాను ప్రార్థన చేసి పంపించానని చర్చి ఫాదర్ వినయ్ తెలిపారు. సాయంత్రం పోప్ ఫ్రాన్సిస్ ఆత్మశాంతి కోసం చర్చి దగ్గర భజన ఏర్పాటు చేశారు. ప్రార్థనకు హాజరైన స్థానికులు చంద్రిక మృతదేహాన్ని చూసి కంచరపాలెం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్‌ఐ దివ్యభారతి, బ్లూకాట్స్ రాంబాబు, సెక్షన్ ఏడీ నాగమణి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలే సేకరించారు. విజయనగరం నుంచి ఎందుకు వచ్చారు, మృతదేహాన్ని చర్చి ఆవరణలో ఎందుకు ఉంచారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. చంద్రిక మరణానికి కారణాలను ఘటనా స్థలంలోనే ఉన్న తల్లి వరలక్ష్మి, అమ్మమ్మ సావిత్రిని అడిగి తెలుసుకుంటున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజిహెచ్‌కు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిప్యూటీ మేయర్‌పై ఆరోపణలకు కట్టుబడి ఉన్నా

- జనసేన కార్పొరేటరు మూర్తి యాదవ్

విశాఖపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని జనసేన కార్పొరేటరు పీతల మూర్తియాదవ్ పేర్కొన్నారు. మేఘాలయ హోటల్‌లో గురువారం విలేకరులతో మాట్లాడుతూ అన్ని ఆధారాలతో శ్రీధర్ అక్రమాలపై పెదవివిప్పానన్నారు. సెటిల్‌మెంట్లు చేస్తున్నానని నిరూపిస్తే ఊడిగం చేస్తానన్నారు. గతంలో వైసీపీ నేతలు విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డి పై ఆధారాలతోనే న్యాయస్థానాల్లో కేసులు దాఖలు చేసి పోరాడుతున్నానన్నారు. డిప్యూటీ మేయరు ఎన్ఏడీ జంక్షన్‌లో చేసిన కబ్జాలను నిరూపిస్తానన్నారు. గిడిజాలలో ప్రభుత్వ స్థలం కబ్జాచేశారని, ఎన్ఏడీలో వైసీపీ కార్యాలయం దరి కర్రల డిపో ఉండగా రౌడీలతో బెదిరించి సెటిల్‌చేసి రూ.1.7 కోట్లు తీసుకున్నారఅన్నారు. కాంగ్రెస్‌పార్టీలో తనకున్న పరిచయాలతో 2007లో జరిగిన జీవీఎంసీ ఎన్నికల్లో తన సోదరికి టికెట్ సంపాదించామని గుర్తుచేశారు. నగరంలో తనపై ఎటువంటి ఎఫ్ఐఆర్‌లు లేవన్నారు.

'ఇనాం భూములు అప్పగించండి'

విశాఖపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని రుషికొండ అగ్రహారం, సంగివలస అగ్రహారంలో ఇనాం భూములకు తామే వారసులమని ఇనాందారుడు టీవీ సాయికుమార్ పేర్కొన్నారు. ఈ రెండు గ్రామాల్లో ఇనాం భూములపై హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలుచేయాలని గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. రుషికొండ అగ్రహారంలో టీడీ నంబరు 1254లో పేర్కొన్న భూములు ఇనాందారులవేనని గతంలో తహసీల్దారు ఇచ్చిన తీర్పుపై జిల్లా యంత్రాంగం హైకోర్టులో కేసు వేయగా, తమకు అనుకూలంగా వచ్చిన తీర్పును అమలుచేయాలని కోరారు.

26న డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం

వెంకోజీపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి సంబంధించి ఈ నెల 26న ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశ మందిరంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇంచార్జి కమిషనర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ సమావేశానికి హాజరవుతున్న ఎక్స్ అఫీషియో, కార్పొరేటర్లు కౌన్సిల్ హాల్ ప్రాంగణంలోనికి ప్రవేశించాక వారి మొబైల్ ఫోన్లు ఫ్లైట్ మోడ్‌లో పెట్టుకోవాలని సూచించారు. వీరిని తప్ప ఇతరులెవరినీ సమావేశ మందిరంలోకి అనుమతి ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్పొరేటర్లు తమ గుర్తింపుకార్డుతో హాజరై అధికారులకు సహకరించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.